
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

శుక్రవారం 13 డిసెంబరు 2024



5

డాగ్.. డయాబెటిస్

- కుక్కల్లో ప్రబలుతున్న షుగర్ వ్యాధి
- 1 నుంచి 5 శాతానికి పెరుగుదల
- మితిమీరిన ఆహారమే కారణమంటున్న వైద్యులు

8





ఇక ఈవీల హవా

విద్యుత్ వాహనాలకు వరాలు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రవాణా పాలసీని ప్రకటించింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు విద్యుత్ వాహనాల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఈవీ వాహనాలు ధర అధికంగా ఉన్నా పర్యావరణం, పెట్రోలు ధరల భారంతో పలువురు ఈవీ వాహనాలను పెద్దసంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 ప్రకటించింది. విద్యుత్ వాహనాల వినియోగదారులు, చార్జింగ్ స్టేషన్ నిర్వాహకులకు ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. దీంతో విద్యుత్ వాహనదారులకు పండుగే.. పండుగని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం వెనుకంజలో ఉండటంతో వాటిని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తాజాగా రూపొందించిన విద్యుత్ రవాణా పాలసీ ద్వారా 2029 నాటికి 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10 వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఔత్సాహిక ఎంఎస్ ఎంఈ పెట్టుబడిదారులకు పెట్టుబడిలో 35 శాతం రాయితీ, ఇంటెన్సివ్‌లు ప్రకటించింది. క్వాలిటీ సర్టిఫికేషన్, విద్యుత్ సుంకం కూడా రీయింబర్స్ చేస్తారు. విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ఒక్కో పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌కు పెట్టుబడిలో 25 శాతం సబ్సిడీ, గరిష్ఠంగా 3 లక్షలు ఇస్తారు.

● వినియోగదారులకూ రాయితీ..

విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వినియోగదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలో మినహాయింపు ఇచ్చింది. 12 శాతంగా ఉన్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయిస్తోంది. అంటే రూ.లక్ష వాహనానికి రూ.12 వేలు లైఫ్ టాక్స్ మినహాయింపు వస్తుంది. దీంతో పాటు వాహన ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. కార్లకు మాత్రం ఇది వర్తించదని సమాచారం. రూ.లక్ష లోపు ఉన్న ఈ-ద్విచక్ర వాహనాలకు, రూ.2 లక్షల లోపు ధర ఉన్న ఈ-3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ-రవాణా వాహనాలకు, రూ.8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ.2 కోట్ల లోపు ధర ఉన్న ఈ-బస్సులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. అమ్మకందారులకు కూడా పది శాతం రాయితీ ప్రకటించారు.

● ప్రతి 30 కి.మీ.కి ఒక చార్జింగ్ స్టేషన్

ప్రధాన రహదారుల్లో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం పాలసీ లక్ష్యం. నగరాల్లో 3 బై 3 కేఎం గ్రిడ్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మొబిలిటీ సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కార్పస్ ఫండ్‌గా కేటాయించింది. ఈ మొబిలిటీ స్టార్టప్‌ల కోసం 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది.

మందులు ఏటిపాలు

ప్రాణాపాయ మందులు.. రోగుల నీరసం పోగొట్టే బలం సిరప్‌లు.. వివిధ రోగాలకు సంబంధించిన ట్యాబ్లెట్లు.. జగనన్న ఆరోగ్య సురక్ష, కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్లు.. ఏటిపాలు చేశారు. ప్రైవేటు దోపిడీని తట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే పేదలకు ఇవ్వాల్సిన మందులు నదిలో పారేశారు. పేదల కోసం రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన మందుల్లో చాలావరకు చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్నాయి. రోగులకు ఇవ్వడానికి చేతులు రాదు కానీ ఇలా పారేయడం ఏమిటని ఆ మందుల గుట్టలను చూసిన పలువురు విస్తుపోతున్నారు. బయో వ్యర్థాల కింద అప్పగిస్తే దొరికి పోతామనుకున్నారో! లేక నదిలో పారేస్తే ప్రవాహంలో కొట్టుకు పోతాయనుకున్నారో కానీ, పెద్దగుట్ట మందులను కృష్ణానదిలో వేశారు. ఈ మందుల గుట్టలపై ప్రశ్నిస్తే ఆస్పత్రులు, 104 సిబ్బంది మావికాదంటే మావికాదంటూ చెప్తూ కృష్ణాజిల్లా వారు పారేసి ఉంటారని నెపం మోపుతున్నారు. ఈ మందుల్లో కొన్ని గడువు తీరిపోగా.. మరికొన్ని 2025 వరకు గడువు ఉన్నాయి. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలోనే మందులకు నిప్పు పెట్టగా తాజాగా నది మధ్యలో గుట్టలు గుట్టలుగా విలువైన ఔషధాలు దర్శనమివ్వడంపై ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

- 2025 వరకు గడువున్నా పారేశారు
- కృష్ణానదిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు
- వైసీపీ హయాంలో ఓ తంతుగా ఆరోగ్య శిబిరాలు.. మందులన్నీ వృథా
- పేద రోగులకు ఇవ్వకుండా పారేయడంపై విమర్శలు
- గడువు ముగిసే సమయంలో కొనుగోలుపై అనుమానాలు
- మావికాదంటే.. మావికాదంటున్న పీహెచ్‌సీ, 104 సిబ్బంది

తెనాలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి ఔషధ కంపెనీల దగ్గర కొని ప్రభుత్వం అందించిన మందులవి. 104లో అందించాల్సినవో! లేక పీహెచ్‌సీల నిర్వాకమో కానీ, కొన్ని గడువు తీరాక.. మరికొన్ని 2025 వరకు గడువున్నా కృష్ణానదిలో పారేశారు. వాటితోపాటే జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, గుండె సంబంధ మందులు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు వంటివి కూడా ఆ చెత్త గుట్టలో ఉన్నాయి. కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్ కోసం నదిలోకి గాలు వేసి ఉంది. ఆ గాలు మార్గంలోని చెత్త కుప్పల్లో ఈ మందులు కూడా ఉన్నాయి. 2024 మేతో గడువు ముగిసిన మందులు ఎక్కువగా ఉంటే, 2025 వరకు గడువున్న మందులు కూడా ఆ గుట్టలో ఉన్నాయి. కొల్లిపర, మున్నంగి ప్రభుత్వ వైద్యశాల సిబ్బందితో పాటు 104 వాహన సిబ్బంది మావి కాదంటే మావికాదంటున్నారు. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గడువు ముగిసిన మందులను ఆస్పత్రి ఆవరణలోనే నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు కృష్ణానదిలో వివిధ రకాల మందులు ప్రత్యక్షం కావడం చూస్తే గత ప్రభుత్వ హయాంలో పేదల వైద్యంపై ఎంతవరకు శ్రద్ధ చూపారనేందుకు నిదర్శనంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే రోగులకు మందులు ఇస్తే వారి ఆరోగ్యం కుదుటపడటంతోపాటు, ఆర్థికపరంగా కూడా వెసులుబాటు ఉంటుంది. కానీ కొన్ని వైద్యశాలల్లో వైద్యులే పేద రోగులకు ప్రైవేటు దుకాణాల్లో మందులు తెచ్చుకోవాలని రాస్తున్నారు. వివిధ రకాల రక్త పరీక్షల కేంద్రాలకు కూడా పంపిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే మందులు, పరీక్షల కిట్లను మాత్రం ఇలా పారేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శిబిరాలు ఓ తంతుగా మారడంతో విలువైన మందులన్నీ వృథాగా మారాయి. ఆస్పత్రులకు ప్రభుత్వం సరఫరా చేసే మందుల్లో ఏదో ఒకటి, రెండు రకాల

(మిగతా 6వ పేజీలో)





మున్నంగి ఇసుక రీచ్ మార్గంలో కృష్ణానది మధ్యలో పారేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, వివిధ రకాల మందులు

- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో కీలక నిర్ణయాలు
- అనేక అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- గోదావరి జలాల ఎత్తిపోతల పథకం నిర్మాణంలో కదలిక
- పల్నాడులో 466 ఎకరాల భూసేకరణకు చంద్రబాబు ఆదేశాలు
- గుంటూరు యూజీడీ పెండింగ్ నిధుల విడుదలకు నిర్ణయం
- ఏబీఐటీ పనుల కొనసాగింపుపై నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి
- కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళికల రూపకల్పనపై నిర్ణయం

సమీక్షలు... ఆదేశాలు



సదస్సుకు హాజరైన గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి గతంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ అంశాలపై సమీక్షలు.. ఆదేశాలు.. సూచనలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు.. ఇదీ రాజధాని సచివాలయంలో గురు వారం జరిగిన కలెక్టర్ల రెండు రోజు సదస్సు జరిగిన తీరు. నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు తీపి కబురు చెప్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో గోదావరి జలాల ఎత్తిపోతల పథకంపై నిర్ణయం తీసుకున్నారు. పైగా ఈ పథకాన్ని 2026 జూన్ కల్లా పూర్తి చేస్తామని ప్రకటించారు. రెండో రోజు సదస్సులో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు, బాపట్ల కలెక్టర్ వెంకటమురళిలు ఆయా జిల్లాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రికి నివేదించగా, వాటిపై ప్రత్యేకంగా చర్చించారు. గుంటూరు నగరానికి సంబంధించి గతంలో ఆగిపోయిన యూజీడీకి పెండింగ్ నిధులు మంజూరుకు సీఎం ఆమోదం తెలపగా నగరపాలక సంస్థలో ఏబీఐటీ ప నుల కొనసాగింపుపై కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు ప్రత్యేకంగా నివేదించారు. స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లపై విస్తృతంగా చర్చ జరగడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అది సాకారం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. గురువారం నాటి కలెక్టర్ల సదస్సులో గోదా వరి - పెన్నా నదుల అనుసంధానంపై ప్రధానంగా చర్చ జరిగింది. సాగర్ అయకట్టుకు గోదావరి జలాల తరలింపు పథకానికి భూసేకరణకు కలెక్టర్ల సదస్సులో సీఎం ఆదేశాలిచ్చారు. దీంతో ఈ ఎత్తిపోతల పథకం పనులకు త్వరలో కదలిక రానున్నది. ఎత్తిపోతలకు సంబంధించిన రెండు పంపుహౌస్‌ల పనులు పురోగతిలో ఉండగా మరో మూడు పంపుహౌస్‌ల పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇక గుంటూరుకు సంబంధించి యూజీడీ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు నివేదించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ స్కీమ్ మంజూరు కాగా దాదాపుగా రూ.500 కోట్లు ఖర్చు చేశామని అయితే రాష్ట్ర ప్రభుత్వ, నగరపాలకసంస్థ వాటా రూ.400 కోట్ల వరకు ఉన్నదని పెండింగ్ నిధుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కోరారు. దీనిపై సీఎం స్పందించి ఆర్థికశాఖ వద్ద పెండింగ్ బిల్లులు ఎంత మొత్తంలో ఉన్నాయనేది తెలుసుకున్నారు. దాదాపుగా రూ.300 కోట్లు త్వరలోనే విడుదల చేసి యూజీడీ స్కీమ్‌ని పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగర పాలక సంస్థతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరా సమస్యలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటీఎంసీ పరిధిలో హైరైజ్ బిల్డింగ్‌లు, ఇం డస్ట్రియల్ పార్కులు, అపార్టుమెంట్లు వచ్చేశాయని, అయితే వారంతా భూగర్భ జలంపైనే ఆధారపడి ఉన్నారని చెప్పారు. గుంటూరు నగరంలోకి

(మిగతా 8వ పేజీలో)

గుంటూరు కలెక్టర్‌కు నాల్గో ర్యాంకు

స్వయంగా ప్రకటించిన సీఎం చంద్రబాబు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల సదస్సు సందర్భంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సమర్పించిన ప్రజంటేషన్ రాష్ట్రంలో నాల్గో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సు ముగింపు సందర్భంగా ప్రకటించారు. జీడీడీపీ టార్గెట్ రూ.1,37,705 కోట్లుగా పెట్టుకున్నామని, తలసరి ఆదాయం రూ.5,14,923, వచ్చే ఐదేళ్లకు వార్షిక వృద్ధిరేటు 15 శాతం కంటే అదనంగా సాధిస్తామని, 2047కి పేదరికం రహిత గుంటూరు జిల్లాగా చేస్తామని విజన్ 2024-29ని కలెక్టర్ ప్రజంటేషన్ చేశారు. ఇందుకోసం మెడికల్ అండ్ హెల్త్, విద్య, న్యూట్రీష న్‌ని కీలకమైన సూచికలుగా పెట్టుకున్నామని చెప్పారు. ఉద్యోగాల కల్పనకు సంబంధించి ఒక కుటుంబంలో ఒక ఐటీ ఉద్యోగి, ఒక వ్యాపారవేత్త ఉండేలా చేసేందుకు ప్రణాళికలు రూపొందించా మన్నారు. ఐటీ వర్కింగ్ స్పేసెస్ కోసం జిల్లాలో 256 ఖాళీ స్థలాలను 19.4 లక్షల ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో గుర్తించామన్నారు. ఐదేళ్లలో 25,849 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు పొందేలా చూస్తామని నివేదించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎనిమిది స్కిల్ హబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. గుంటూరు చానల్ ఆధునికీకరణ, డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ కింద ఐదేళ్లలో 87.191 హెక్టార్లను సాగులోకి తీసుకొస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని, వరి, పత్తి సాగులో సూక్ష్మపోషక లోపాలను నివారిస్తామని చెప్పారు. రూ.263 కోట్ల ఆరు ఆర్‌వోబీలను ప్రతిపాదించామన్నారు. అమరావతి రైలుమార్గం నిర్మాణంతో దేశంలోని అనేక ప్రాంతాలకు కనెక్టివిటీ వస్తుందన్నారు. విజయవాడ తూర్పు, పశ్చిమ బైపాసు, అమరావతి అవుటర్, ఇన్నర్ రింగురోడ్డు పనులకు అవసరమైన భూమిని సేకరించి ఇస్తామన్నారు. సరుకు రవాణాని స్ట్రీమ్‌లైన్ చేసేందుకు మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కుని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రత్తిపాడు మండలంలోని పెదమల్లాయపాలెం ఇండస్ట్రియల్ పార్కుని 10 ఎకరాల్లో ఏర్పాటు చేస్తామన్నారు.

వందన సమర్పణ చేసిన కలెక్టర్

కలెక్టర్ల సదస్సు ముగింపు సందర్భంగా వందన సమర్పణ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కలెక్టర్ నాగలక్ష్మికి ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలను, అభీష్టం మేరకు తాము శక్తివంచన లేకుండా స్వర్ణాంధ్ర 2047 కోసం కృషి చేస్తామన్నారు. ఇందులో తమను భాగస్వామ్యం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు దగ్గరగా ఉండి వారి ఆకాంక్షలు తెలుసుకుని పరిపాలనను కొనసాగిస్తామన్నారు. సదస్సులో చర్చించిన అంశాలన్నింటిని ఆచరణలో పెడతామన్నారు.

వివరాలు 8లో

రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు ఈ- లాటరీ

- 14 గ్రామాలు.. 261 మంది రైతులకు కేటాయింపు

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో సంఘ్ విజయం

రాజధానిలో 'ఫైవ్'స్టార్ హోటల్స్

లాలుపురం శివారులో యువకుడి హత్య

- వివాహేతర సంబంధమే కారణం

ఉత్సాహంగా పోలీసు క్రీడలు

రెండో రోజూ కొనసాగిన జిల్లా స్థాయి పోటీలు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు గురువారం కూడా రెండో రోజూ కొనసాగాయి. జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతు ఈ పోటీలను పర్యవేక్షించారు. జావలిన్ త్రో, కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందేలు, టెన్నిస్, షటిల్ తదితర పోటీలను నిర్వహించారు. పోలీస్ క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. సిబ్బంది, అధికారులు అనే తేడాలు లేకుండా ఆయా అంశాల్లో పోటీపడ్డారు.



జావెలెన్ త్రో వేస్తున్న మహిళా సిబ్బంది

ఆర్టీసీలో ఓడీలపై డీపీటీవో సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ గుంటూరు జిల్లా పరిధిలోని డిపోల్లో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్)లపై జిల్లా ప్రజారవాణాధికారి ఎమ్ .రవికాంత్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గుంటూరు-1,2 డిపోలతోపాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లో కొందరు ఉద్యోగులు అక్రమంగా ఓడీలు పొందుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ 'ఓడీలతో ఎంజాయ్' శీర్షికన ఈ నెల 6న 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో కథనం ప్రచురితమైంది. దీనికి డీపీటీవో స్పందించారు. డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విభజిత జిల్లా వ్యాప్తంగా ఐదు డిపోల్లో 51 మంది అక్రమంగా ఓడీలు పొందుతున్నట్లు సమాచారం. అక్రమ ఓడీలపై ఆయన స్పష్టత తీసుకున్నారు. ఇందులో అత్యధికంగా గుంటూరు-2తో పాటు గుంటూరు-1లో ఉన్నట్లు గుర్తించారు. అంతేగాక పొన్నూరులో కూడా ఓ ఉద్యోగిపై ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఇలా అక్రమంగా ఓడీలు పొందుతోన్న వారిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. అర్హుల అర్జీలను బుట్టదాఖలు చేసి అనర్హులకు ఓడీలు మంజూరుపై కూడా విచారణ జరుపుతున్నారు. అక్రమ ఓడీలను ఒకటి, రెండు రోజుల్లో రద్దు చేయాలని డీపీటీవో నిర్ణయానికి వచ్చారు.

కొత్త రసాయన చర్యల ఆవిష్కరణ సాధ్యమే


విద్యార్థులతో ఆచార్య ఏటీ బిజు

గుంటూరు(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్గానో క్యాటలిసిస్ ద్వారా అనేక కొత్త రసాయన చర్యలను ఆవిష్కరించడం సాధ్యమవుతుందనీ, అంతేకాకుండా ఇవి పరిశోధనలో పురాతన మార్గాలను తెరవగలవని ఐఐఎస్సీ బెంగళూరు ఆచార్య ఏటీ.బిజు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో గురువారం ఆయన మాట్లాడారు. ఆచార్య ఏటీ.బిజు మాట్లాడుతూ ఆర్గానోక్యాటలిసిస్ అనేది ఒక ప్రత్యేకమైన రసాయన పద్ధతి అని, ఇది పరిశోధన, పరిశ్రమల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి భోపాల్‌లోని ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ నితిన్ టి.పాటిల్ మాట్లాడుతూ రసాయన శాస్త్రం పరిశోధనల్లో రోజురోజుకు వినూత్న అభివృద్ధి చెందటంతోపాటు ఔషధ తయారీ,సేంద్రియ రసాయన శాస్త్రం, మెటీరియల్స్ సైన్స్ మధుమేహం వ్యాధులకు సంబంధించి మందులను రూపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ ఎస్.భాస్కర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ జి.శేఖర్, ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టర్ సి.రఘు, వివిధ దేశాల ప్రతినిధులు, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా (డైక్ సెంటర్‌లో) మెడికల్ ఆఫీసర్, డెంటల్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను జిల్లా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబరు 30 లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అందజేయాలని ఆమె కోరారు. రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా దరఖాస్తులు పంపుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయుడు అరెస్టు

కొల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కిష్కిందపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వల్లభనేని వెంకటేశ్వరరావు బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయుడు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు ఎదుట లొంగిపోవడంతో నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మూలిక వైద్యంపై పరిశోధనలు రావాలి

- ఇన్‌ఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి
- ముగిసిన రెండు రోజుల ఫార్మసీలో జాతీయ సదస్సు


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఇన్‌ఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

పెదకాకాని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కాపాడటం కోసం మూలిక వైద్యంలో విస్తృత పరిశోధనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి సూచించారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ ఔషధాలు కనుగొనడంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వృత్తి పట్ల నిబద్ధత ఉండటంతో ప్రజారోగ్యం ఆ మేరకు సంతృప్తికరంగా ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా విషతుల్యత లేని ఔషధాలను కనుగొనేందుకు విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. ఉదయం జరిగిన ప్లీనరీ సెషన్‌లో ఆచార్య గురువాయూరప్పన్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణలో నూతన ఆవిష్కరణలు, క్యాన్సర్ రోగులు ఎదుర్కొనే ఇతర ఇబ్బందులను నివారించడానికి తాను చేసిన పరిశోధనలో సత్ఫలితాలు వస్తున్నాయని విద్యార్థులకు వివరించారు. హైదరాబాదులోని నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డీన్ ఆచార్య సీహెచ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తన పరిశోధనలో ప్రీ క్లినికల్ ల్యాబ్ అనుభవాలను వివరించారు. ఒక వైద్యుడు తప్పు చేస్తే ఒకరు, ఇద్దరు రోగులు మరణిస్తారనీ, అదే ఒక ఫార్మాసిస్టు వలన తప్పు జరిగితే కొన్ని వందల మంది ఇబ్బందులు పడతారని తెలిపారు. ఫార్మసిస్టులు కనుగొనే ఔషధాలు సమాజ రుగ్మతలను ఎదుర్కొనే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండు, మూడో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఓఎస్ ఛైర్మన్, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.విద్యాధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ. ప్రమీలారాణి తదితరులు మాట్లాడారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ పోస్టర్ ప్రజెంటేషన్లకు 137 మంది పాల్గొనగా రెండు రోజుల జాతీయ సదస్సులో వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు.

దాల్ మిల్లులో చోరీని ఛేదించిన పోలీసులు

- రూ 4.35 లక్షల నగదు రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు

నాదెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాల్ మిల్లులో జరిగిన చోరీని పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ 4.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గణపవరం గ్రామ పరిధిలోని ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంకలో గల విజయ వాసవి దాల్ అండ్ రైస్ మిల్లు వారు ప్రతి రోజూ అమ్మకాలకు సంబంధించి నగదును బ్యాంకులో జమ చేస్తారు. శుక్రవారం వచ్చిన నగదును సమయం కుదరక సోమవారం వరకు బీరువాలోని లాకర్‌లో ఉంచారు. మంగళవారం రూ.4.35 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మిల్లు భాగస్వామిదారుడు కనకం లక్ష్మయ్య నాదెండ్ల ఎస్ఐ పుల్లారావుకు చోరీ విషయపై ఫిర్యాదు చేశారు.

ఏసీ రూమ్‌నే టార్గెట్‌గా....

గుంటూరులోని శారదా కాలనీకి చెందిన నిందితుడు మిక్కిలి సందీప్ వ్యసనాలకు బానిస అయ్యాడు. ఈ క్రమంలో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఏసీ రూమ్‌లే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో చోరీ చేశాడు. ఈ క్రమంలో దాల్ మిల్లు ఏసీ రూమ్ తాళాలు పగలగొట్టి బీరువాలోని నగదును చోరీ చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ సీఐ సుబ్బయ్య నాయుడు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ పుల్లారావు, ఏఎస్ఐ రోసిబాబు, కానిస్టేబుళ్లు ఇర్మియా, అశోక్ బృందాలుగా ఏర్పడి నిందితుడి ఆనవాళ్లను గుర్తించారు. గణపవరంలో ఉన్న అతన్ని చాకచక్యంగా అరెస్టు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతనిపై ఏడు కేసులు ఉన్నాయని చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారని ఆయన వివరించారు. కాగా నాదెండ్ల పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ నాగేశ్వరరావు సందర్శించి రికార్డులు పరిశీలించారు.

మందులు.. ఏటిపాలు

(5వ పేజీ తరువాయి)

మందులు మిగిలిపోయినా, వాటిని పారేశారంటే అర్థం ఉంటుంది. కరోనా తర్వాత వస్తున్న రోగాలకు తగ్గ మందులన్నీ ఉన్నా, అవన్నీ మిగిలిపోవడం విడ్డూరమే. పారాసిటమాల్, ఇతర యాంటీబయోటిక్స్, విటమిన్ డీ 3, గ్యాస్, షుగర్, బీపీ వంటి నిత్యావసర మందులు కూడా నదిలో పారేసిన వాటిలో ఉండటం విశేషం. ఇకటి, రెండు పీహెచ్‌సీల పరిధిలోనే ఇన్ని మందులు గడువు ముగిసిపోయినవి ఉంటే, రాష్ట్రం మొత్తం మీద ఇంకెన్ని ఉంటాయనేది ఆందోళన కలిగించే విషయం. బలానికి సంబంధించి, ఐరన్ వంటి పోషక విలువలు తగ్గిన వారికి ఉపకరించే విటమిన్ ట్యాబ్లెట్లు కూడా వృథా చేశారు. ఖరీదైన ఇంజక్షన్లు కూడా పారేసిన వాటిలో దర్శనమిస్తున్నాయి. చివరకు చిన్న పిల్లలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు కూడా ఉపయోగించలేదంటే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఈ మందులను ప్రభుత్వం సరఫరా చేసిన తర్వాత రెండు వేసవి సీజన్లు వచ్చాయి. ఆ సమయంలో డీహైడ్రేషన్‌తో ఆస్పత్రి పాలైన వారు ఎందరో ఉన్నారు. వారికి ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా నదిలో పారేశారు. ఇక నిరోడ్ ప్యాకెట్లను కూడా పారేశారు.

సురక్ష అమల్లో నిర్లక్ష్యం

జగన్ ప్రభుత్వ కాలంలో పేదల కోసం అంటూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారు. 2023 సెప్టెంబరులో సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీనిలో వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ రెండుసార్లు తిరిగి, సర్వే, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలి. దీనికోసం 104 వాహనాన్ని ఉపయోగించుకున్నారు. చికిత్స అవసరం అనుకుంటే శిబిరాల్లో పరీక్షించి, మందులు అందేలా చూడాలి. అయితే ఇవేమీ అన్నిచోట్ల ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం జరగలేదు. దీంతో మందులన్నీ మూలన పడేశారు.

పైగా 2023లో పథకం అమలు జరిపితే, దానికి అవసరమైన మందులను 2022 చివరలో తయారు చేసినవి సరఫరా చేశారు. అవికూడా 2023, 2024 సంవత్సరంలో గడువు పూర్తయ్యే సమయంలో వాటిని నాటి ప్రభుత్వం కొనుగోలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోనీ వాటినైనా గడువు ముగిసేలోపు రోగులకు అందించారా అంటే అదీ జరగలేదు. జ్వరం, యాంటీబయోటిక్స్ ట్యాబ్లెట్లు అందించలేకపోయారంటే ఏదో సాకు చెప్పవచ్చు. కానీ వాక్సిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కోవిడ్ ర్యాపిడ్, మలేరియా ర్యాపిడ్ టెస్ట్‌ల కిట్లు కూడా ఏటిపాలు చేశారంటే ఈ పథకం అమలులో ఎంత నిర్లక్ష్యం రాజ్యమేలిందనేది అర్థమవుతుంది. గడువు ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడే మందులు గడువు తీరాక విషంతో సమానం. ఇటువంటి ప్రమాదకర పరిస్థితులు కలిగించే మందులను, సెలైన్ సీసాలను కూడా నదిలో పారేయడం దారుణం. అవి నదిలో కొట్టుకుపోయి నీటిలో కలిసి ఆ నీరు కలుషితమవుతుంది. వాటిని తాగే జంతువులు, మనుషులు నది, సముద్ర జీవులకు హాని కలిగే అవకాశం ఉంది. అయినా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా మందులను నదిలో పారేయడంపై సమీప గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతి


వినయ్‌కుమార్ (ఫైల్)

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని సుద్దగుంతలకు చెందిన గంగపట్ల వినయ్‌కుమార్ (23) పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. వినయ్‌కుమార్ గత మంగళవారం నుంచి కనిపించకుండా పోయాడు. అదే రోజు అతని కోసం కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుండగా పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడి కాలువ వద్ద అతని ఫోన్ లిఫ్ట్ చేశారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా వినయ్‌కుమార్ సెల్‌ఫోన్‌తోపాటు చెప్పులు లభ్యమయ్యాయి. వినయ్‌కుమార్ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా గురువారం దుర్గిలోని బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద మృతదేహం లభ్యమైంది. మాచర్ల పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన గురువారం మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని యాదవుల బజారుకు చెందిన వీర్ల రాంబాబు, నాగేశ్వరమ్మ దంపతులు గురువారం తమ పొలంలో ఘర్షణ పడ్డారు. అనంతరం పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నం చేశారు. సమీప పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద జరిగింది. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బొలక కృష్ణ గురువారం వివిధ పనుల పై ద్విచక్ర వాహనంపై మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి వెళ్లాడు. రాత్రి వేళ తిరుగు ప్రయాణంలో భైరవునిపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైకు పైనుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

మేడికొండూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు


కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీఆర్డీఏ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

మేడికొండూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌డీఏ ఎస్ఈ పి.సుబ్రహ్మణ్యం, గుంటూరు టౌన్-2 ఏడీఈ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్ ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా గురువారం తనిఖీలు చేపట్టారు. మేడికొండూరు మండలంలోని 16 గ్రామాలలో ఈ తనిఖీలు చేపట్టారు. 60 మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి గ్రామాలలో 2,188 సర్వీస్‌లను తనిఖీ చేశారు. వాటిలో 98 సర్వీసులకుగానూ ఓవర్ లోడ్ కింద రూ. 5,13,500 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం గుర్తించి మూడు సర్వీసులకు రూ.1.50 లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం 102 సర్వీస్‌లపై కేసులు నమోదు చేసి, రూ. 6.65 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు సీఆర్‌డీఏ సూపరింటెండెంట్ ఇంజనీరు పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ తనిఖీల్లో గుంటూరు రూరల్ ఏడీఈ గురునాథం, చిలకలూరిపేట ఏడీఈ ఆర్.అశోక్ కుమార్, గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలోని 9 మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

49,551 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 50,816 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,551 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 43,384 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000
నెంబరు. 5	8000	12000
273	9000	11500
341	8000	15000
4884	11000	11000
సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500
బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	9000	14000
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500
నెంబరు.5	8000	11500
273	8500	12500
341	8000	13500
4884	9500	12500
సూపర్ 10	11800	11800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500
బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	8000	11500
తెల్లకాయలు	4500	9500

వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ నాయకులకు మాట్లాడే నైతిక అర్హత లేదని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడును సర్వనాశనం చేసిన దొంగలంతా మళ్లీ ఒక గూటికి చేరారని విమర్శించారు. అరాచకాలు, దుర్మార్గాలతో పాలన సాగించిన వైసీపీ నేతలు నేడు మళ్లీ ఏకమయ్యారని అన్నారు. ఇసుక, మైనింగ్ దోపిడీల నుంచి కబ్జాల వరకు ఐదేళ్లలో చేయని దుర్మార్గాలు లేవనీ, కోట్లు రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. అరాచకాలు, హత్యలు, దోపిడీలు భరించలేకనే గత ఎన్నికల్లో పల్నాడు జిల్లాల్లోని ఏడుగురు ఎమ్మెల్యేలను ప్రజలు ఇంటికి పంపించారనీ, అయినా వారి ప్రవర్తనలో మార్పు లేదని దుయ్యబట్టారు. రాక్షస పాలనపై తిరుగుబాటు తీవ్రతను రాష్ట్రం మొత్తానికి పల్నాటి ప్రజలు తెలియజేశారన్నారు. ప్రజలను ఐదేళ్లపాటు భయభ్రాంతులకు గురిచేసి ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారో అందరూ గమనిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేసి ఇప్పుడు దొంగేదొంగ అని అరిచినట్లు కూటమిపై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. వైసీపీ మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని అన్నారు.

రేపు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక ఈ నెల 14న స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల తరఫున వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతాయని జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ ఎం సుబ్బరాజు గురువారం తెలిపారు. ఎంపికకు హాజరు అయ్యే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు, 70 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 22 నుంచి 25 వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అదనపు సమాచారం కోసం పీడీ రాయల ఆంజనేయులు 9063577055 నంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు అన్నారు.

పేరేచర్లలో భలే చికెన్ బేరం


చికెన్ కోసం ఎగబడుతున్న స్థానికులు

మేడికొండూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో చికెన్ కోసం గురువారం షాపుల ముందు జనం బారులు తీరారు. భలే మంచి చౌక బేరమంటూ స్థానికులు చికెన్ కోసం ఎగబడ్డారు. సహజంగా చికెన్ కోసం షాపుల వద్దకు ఆదివారం ఎక్కువ మంది వెళ్తుంటారు. అందుకు భిన్నంగా గురువారం చికెన్ కోసం బారులు తీరడం విశేషంగా చెప్పుకుంటున్నారు. దీనికి కారణం చికెన్ ధర తగ్గించి అమ్మడమే. పేరేచర్లలో నూతనంగా చికెన్ షాపు పెట్టారు. ప్రారంభ ఆఫర్‌గా చికెన్ ధరను కిలో వంద రూపాయలుగా ప్రకటించారు. ఇంకేముంది తమ వ్యాపారం ఎక్కడ దెబ్బతింటుందోనని మిగతా షాపుల వాళ్లు కూడా ఇదే ధరకు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయం అందరికీ తెలియడంతో ఒక్కసారిగా జనం షాపుల వద్దకు చేరుకొని క్యూలో నిలబడి చికెన్ కొనుగోలు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ముప్పాళ్ళ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు వందల గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సోమేశ్వరరావు గురువారం తెలిపారు. బుధవారం ముప్పాళ్ళలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని విచారించామని, దీంతో వారు గంజాయి అమ్ముతున్నట్టుగా గుర్తించామన్నారు. ముప్పాళ్ళకు చెందిన పఠాన్ చాంద్ బాషా, కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన బత్తుల నరసింహారావు గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇద్దరినీ కోర్టులో హాజరు పర్చినట్లుగా తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 582.40 అడుగులు ఉంది. ఇది 289.93 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6979 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7029, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 45,396 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పారిశుధ్య పనులు పిన్ పాయింట్ వరకూ జరగాలి

● సుద్దపల్లి డొంక, ప్రగతినగర్, పొన్నూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించిన జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులు పిన్ పాయింట్ మేరకు జరగాలని, శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు మరింత బాధ్యతగా ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్ల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శుల ఆదేశించారు. స్థానిక సుద్దపల్లి డొంక, ప్రగతినగర్, పొన్నూరు రోడ్డు, ఎల్ఆర్ కాలనీ, పట్నంబజార్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక ఏటీ అగ్రహారం, రామనామక్షేత్రం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యంపై ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాకపోవడం వలన దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, డీఈఈలు నాగ భూషణం, మధుసూదన్, శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పరిశీలన చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నేటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా

ఉండవల్లి పంపింగ్ కేంద్రం నుండి తాగునీటిని సరఫరా చేసే 1600 ఎంఎం డయా మేజర్ పైప్ లైన్‌పై తక్కెళ్లపాడులో ఏర్పడిన లీకును జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు షెడ్యూల్‌కి ముందే బుధవారం అర్ధ రాత్రికి పూర్తి చేశారు. ఈ విషయాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం పాక్షికంగా శుక్రవారం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. తక్కెళ్లపాడులో ఏర్పడిన లీకుతో పాటు, వివిధ రిజర్వాయర్ల పరిధిలో కూడా గుర్తించిన లీకుల మరమ్మతు పనులను జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు నిర్దేశిత షెడ్యూల్ కంటే ముందుగానే పూర్తి చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చేశారన్నారు.



మరమ్మతులు చేపట్టిన పైపులైన్

ఆర్‌జేడీకి ఏపీటీఎఫ్ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు(విద్య),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం హయాంలో పాఠశాల విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ నిరంకుశ వైఖరితో, చిన్న కారణాలతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై అక్రమంగా విధించిన క్రమశిక్షణా చర్యలను ఉపసంహరించు కోవాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శిలు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కోత విధించిన ఇంక్రిమెంట్లు వెంటనే పునరుద్ధ రించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారణ, పి.లక్ష్మీ నారాయణ, జిల్లా కార్యదర్శి లు మూర్తి, జి. దాస్, జహంగిర్, వీరయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన రిటైర్డ్ ఏఎస్పీ సత్యనారాయణ



వెంకయ్యనాయుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యనారాయణ

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును హైదరాబాద్‌లోని కార్యాలయంలో రిటైర్డ్ ఏఎస్పీ, రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్య నారాయణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేశారు. విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వెంకయ్య నాయకత్వంలో సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఏసీ కళాశాలలో తాను విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో చేసిన ఉద్యమాలను సత్యనారాయణ గుర్తుచేశారు.

చేనేత కార్మికులకు 'ఉపాధి హామీ' వర్తింపజేయాలి



ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్న వరప్రసాద్ యాదవ్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఎన్ఆర్ఈజీఎస్ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వర్తింపజేసి ఆకలి చావులను నిరోధించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఓబీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు, దక్షిణ మధ్య రైల్వే సంప్ర దింపుల కమిటీ సభ్యుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి రూ 39 వేల కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ నిధులను సక్రమంగా వినియోగించాలని కోరారు. బీసీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు రూ.10 లక్షల నుంచి రూ 50 లక్షల వరకు 50 శాతంతో సబ్సిడీ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కాపుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాపులకు మేలు చేసేది టీడీపీ ప్రభుత్వమేనని కాపు నేతలు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు కాపు భవన్‌కు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసి ఏపీఈడబ్ల్యూఐడీసీకి నిర్మాణ బాధ్యతలు అప్పగించడంపై కాపు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మేళం సైదయ్య మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా తొలి ఏడాదిలోనే బడ్జెట్‌లో కాపు కార్పొరేషన్‌కు రూ.4,647 కోట్లు కేటాయించిందని అన్నారు. కాపు భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేపల్లి కాలనీలోని హ్యాపీ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్ కు చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ తరపున గురువారం నిత్యావసర వస్తువులు అందించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది గుజ్జుల పాండురంగారెడ్డి, ఆడిటర్లు ఎంఎస్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్ చేతులమీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. వృద్ధుల బాగోగులు చూస్తానని ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది చిన్నం మురళీధర్ హామీ ఇచ్చారు.పుట్టినరోజు, పెళ్ళిరోజులకు వృద్ధాశ్రమాలో అన్నదానం చేయాలని చిన్నం మురళీధర్ కోరారు.



తల్లి సుబ్బులు, కూతురు కొత్తపల్లి రమణ

ఆస్తి వివాదంలో తల్లీకూతురు ఆత్మహత్యాయత్నం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదం నేపథ్యంలో తల్లీకూతుళ్లు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ సంఘటన స్థానిక ఏటీ అగ్రహారం 17వ లైనులో గురువారం జరిగింది. తల్లీకూతుళ్లకు తీవ్ర గాయాలు కావడంతో వారిని స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పుచ్చల సుబ్బులు (68) భర్త నర్సిరెడ్డి సంవత్సరీకం బుధవారం జరిగింది. వారికి ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. ఆస్తి విషయమై వారికి కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో లక్ష్మీనగర్‌కు చెందిన సుబ్బులుకు పెద్ద కూతురు కొత్తపల్లి రమణకు ఆస్తి విషయమై గొడవ జరిగింది. పుచ్చల సుబ్బులు, కూతురు కొత్తపల్లి రమణ(40) క్షణికావేశంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఇది గమనించిన స్థానికులు వారిని వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ట్రాఫిక్ సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి గురువారం ఆమె పర్యవేక్షించారు. తొలుత బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, కొరిటెపాడు, గుజ్జనగుండ్ల వరకు ద్విచక్ర వాహనంపై ప్రయాణించిన ఆమె, ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. కొన్నిచోట్ల ట్రాఫిక్ జామ్‌కు చిరు వ్యాపా రులు, తోపుడు బండ్లను కూడళ్లలో రోడ్లపై నిలపటమేనని గుర్తించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. నాణ్యమైన సీసీ కెమె రాల పర్యవేక్షణ అవసరమని చెప్పారు. గుజ్జనగుండ్లలో ఓ షాపింగ్ కాం ప్లెక్స్ నిర్వాహకులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక జేకేసీ కాలేజీ రోడ్డు కూడలిలో కొంతమంది అనధి కార ఆటో స్టాండ్ ఏర్పాటు చేయడాన్ని ఆమె ప్రశ్నించారు. ట్రాఫిక్ జామ్ అవ డానికి వీలులేదని ఎమ్మెల్యే వారిని హెచ్చరించారు. స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్డులో బారికేడ్ల ఏర్పాటుపై కొంతమంది ఆమెకు ఫిర్యాదు చేశారు. ఆకతాయిలు తమని వేధిస్తున్నారని పట్టాభిపురంలో పలువురు విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులని ఆదేశించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, ఈలోపు నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యకు ప్రత్యా మ్నాయ పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన కూడళ్లో స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ సింగయ్య, కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, రాజేష్ ముత్తినేని, కొల్లి అనిల్, వడ్లమూడి వెంకటేశ్వరావు, కన్నసాని బాజీ తదితరులు పాల్గొన్నారు.

సరుకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తాం

● ఫ్రైట్ కస్టమర్స్ మీట్‌లో డీఆర్ఎం రామకృష్ణ



రైల్ వికాస్ భవన్‌లో జరిగిన ఫ్రైట్ కస్టమర్స్ మీట్‌లో పాల్గొన్న డీఆర్ఎం రామకృష్ణ, ఇతర అధికారులు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ నుంచి కస్టమర్ల సరు కులను సురక్షితంగా, భద్రంగా గమ్యస్థానాలకు చేరుస్తామని డీఆర్ఎం ఎం రామకృష్ణ హామీ ఇచ్చారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో గురువారం డివిజనల్ కస్టమర్స్ మీట్ జరిగింది. ఈ సమా వేశానికి సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్ కుమార్ అధ్యక్షత వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్‌ని కస్టమర్లు మరింతగా పెంచాలన్నారు. వ్యాగన్లను ఎక్కువ రోజు ఉంచుకోవద్దని సూచించారు. సాధ్యమైనంత త్వరగా లోడింగ్ జరిగేలా చూడాలని కోరారు. సిమెంట్, ఎఫ్‌సీఐ సైడింగ్‌లలో లోడింగ్ వేగంగా జరగాలని, లోడింగ్ పూర్తికాగానే వ్యాగన్ తలుపులు మూసేసి సీలు వేయాలని, రైల్వేకి బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో ఏడీఆర్ఎం కే సైమన్, సీనియర్ డీవోఎం ఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఈఎన్-కోఆర్డినేషన్ జేవీ అనూష తదితరులు పాల్గొన్నారు.

బైక్ కొనివ్వలేదని.. తాళం చెవులు మింగేశాడు

● ఎండోస్కోపీతో తొలగించిన జీజీహెచ్ వైద్యులు



భవానీ ప్రసాద్‌తో వైద్యులు, ఇన్‌సెట్లో తొలగించిన తాళాలు

గుంటూరు మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): పక్కింటి కుర్రాడు కొత్త బైక్ కొన్నాడని, తాను అడిగితే నడిపేందుకు ఇవ్వలేదనే ఉక్రో షంతో యువకుడు ఇంట్లో ఉన్న నాలుగు తాళం చెవులను మింగిన ఘైనమిది. వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఆసు పత్రికి తరలించగా వైద్యులు సకాలంలో వాటిని తొలగించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నర్సరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్ తమ ఇంటి పక్కనే ఉండే యువకుడు కొత్త బైక్ కొనడంతో దానిని నడి పేందుకు ఇవ్వమని అడిగాడు. అందుకు ఆ యువకుడు అంగీకరించలేదు. దీంతో, మన స్తాపం చెందిన ప్రసాద్ ఇంటికి వెళ్లి తనకు కొత్త బైక్ కొనివ్వాలని కుటుంబసభ్యులను అడిగాడు. బైక్ కొనే ప్రసక్తే లేదని కుటుంబ సభ్యులు తేల్చి చెప్పారు. దీంతో, కోపోద్రిక్తుడైన భవానీ ప్రసాద్ వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న నాలుగు తాళం చెవులను మింగేశాడు. ఇది చూసి ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బాధితుడిని చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏ కవిత గురువారం ఎండోస్కోపీ పరికరం ద్వారా అతను మింగిన నాలుగు తాళాలను సులువుగా తొలగించారు. దీంతో భవానీ ప్రసాద్‌కు ప్రమాదం తప్పింది. రోగిని వెంటనే ఆసుపత్రికి తీసుకురావడం వల్ల పేగుల్లో ఇరు క్కున్న తాళాలను తొలగించామని, ఆలస్యమై ఉంటే తాళాలు ఉదరంలోకి చేరి ఉండేవని, అప్పుడు శస్త్రచికిత్స చేసి తొలగించాల్సి వచ్చేదని తెలిపారు. యువకుడి ప్రాణాలు కాపాడిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సూపరింటెం డెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ అభినందించారు.

గ్రంథాలయాల బలోపేతానికి కృషి

● రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు, పాల్గొన్న అరసం నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంధాయాలను మరింతగా బలోపేతం చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏఎల్‌బిఈడీ కళాశాల ఆవరణలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో అరసం ఆధ్వర్యంలో పలు అంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం బహుమతి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శారీరక లోపాన్ని అధిగమించి ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగానని అన్నారు. ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని దాని కోసం పోరాడాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం అరసం ఆధ్వర్యంలో నిర్వహించిన కథ చెప్పండి, అభ్యుదయ గీతాలు, నేను చదివిన మంచి పుస్తకం, శతక పద్య పఠనం పోటీలలో విజేతలకు ప్రోగ్రెసివ్ ఫోరం గుంటూరు శాఖ అధ్యక్షుడు పి మల్లికార్జునరావు, డాక్టర్ చిగురుపాటి యశస్వినితో కలసి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అరసం నాయకుడు వల్లూరి శివప్రసాదు, బుల్లా రవి పాల్గొన్నారు.

ముగిసిన ఘంటసాల జయంతి వారోత్సవాలు

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్ళా అశోక్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు 13 వేలకు పైగా పాటలు పాడి సంగీతాభిమానులను ఓలలాడించిన మహాగాయకుడు ఘంటసాల అని కీర్తించారు. ఘంటసాల ఆలపించిన భగవద్గీత, వెంకటేశ్వరస్వామి సుప్రభాతం తెలుగు భాషా ఉన్నంత వరకూ శాశ్వతంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయకుడు రత్నాజీ, లక్ష్మీ, దిలీప్, శివప్రసాద్, రామకృషారెడ్డి, బాలస్వామి, పరమేశ్వరి, రేవతి, అప్పారావు, పింగళి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

జీడీసీఏకు తాత్కాలిక కమిటీ నియామకం



వివరాలు వెల్లడిస్తున్న మహితీ శంకర్, మనోజ్ సాయి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (జీడీసీఏ)కు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఏసీఏ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న కమిటీతో పాటు గతంలో ఉన్న కమిటీల మధ్య కొంత వివాదం చోటు చేసుకున్న నేపథ్యంలో గత నెల 29, 30 తేదీలలో ఏసీఏ విచారణ జరిపింది. ఈ సందర్భంగా వివాదాలు పరిష్కారమయ్యే వరకూ గుంటూరుకు చెందిన మాజీ రంజీ, దేవధర్ ట్రోఫీ క్రికె టర్లు బోడా సుధాకర్ యాదవ్, వేముల మనోజ్ సాయి, న్యాయవాది, మాజీ క్రికెటర్ ఉమ్మడిశెట్టి మహతిశంకర్‌లను కమిటీ సభ్యు లుగా నియమించారు. ఈ సందర్భంగా మహితీ శంకర్, మనోజ్‌సాయిలు మాట్లా డుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. ఈ నెల 15న స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్-12 బాలుర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న ఆచార్య జమీందార్

పాలస్తీనా సార్వభౌమాధికారంపై దాడిని ఖండించాల్సిందే

గుంటూరు(విద్య),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమెరికా అండతో పాలస్తీనా సార్వభౌమాధికారంపై ఇజ్రాయేల్ చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కేఎల్‌యూ ప్రొఫెసర్ బుడ్డిగ జమీందారు అన్నారు. ఆం దోళన వ్యక్తం చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పిడిఎస్‌వో), నవయువసమాఖ్య (ఎన్‌వైఎస్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట వైన్‌డీలర్స్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన 'పాలస్తీనా సంఘీభావ సభ'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జమీందార్ మాట్లాడుతూ ఇటువంటి చర్యలను ఉపేక్షిస్తే రేపు మన సార్వభౌమాధికారంపై కూడా దాడులు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ, పీడీఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, నవ యువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె బాషా, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సి.విజయ, జన సాహితి రాష్ట్ర అధ్యక్షులు దివ కుమార్ ,పిడిఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను తదితరులు ప్రసంగించారు.

డాక్టర్ విజయకు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం



న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ అందుకున్న జాతీయ పురస్కారం

గుంటూరు మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్యు త్తమ స్థాయిలో పక్షవాత వైద్య చికిత్స అంది స్తున్నందుకు గాను స్థానిక లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్నారు. లలితా హాస్పిటల్స్‌లోని అంకినీడు అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ యూనిట్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవ హరిస్తున్న డాక్టర్ విజయ, ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన స్ట్రోక్ ఇన్నోవేషన్ అండ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024లో 'బెస్ట్ స్ట్రోక్ కేర్ ప్రొవైడర్ ఆఫ్ ది ఇయర్' జాతీయ అవార్డును అందుకున్నారు. నేషనల్ స్ట్రోక్ కాంక్లేవ్‌లో భాగంగా న్యూఢిల్లీలోని హయత్ రీజెన్సీలో నవంబరు 30న ఈ అవార్డుల ప్రదానోత్స వం జరిగింది. క్వాలిటీ డ్రైవెన్ స్ట్రోక్ కేర్ అండ్ ఎక్సలెన్స్ అనే అంశానికి సంబంధించి ఆమె ప్యానలిస్టుగా పాల్గొని తన అభిప్రాయాలను పంచు కున్నారు. భారతదేశంలో పెరుగుతన్న పక్షవాత వ్యాధి భారాన్ని పరిష్కరించే విధంగా పలు అంశాలను, వినూత్న పరిష్కారాలు, భాగస్వామ్యాలు, విధానాలపై చర్చించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ జ్యోత్స్నకుమారి తదితరులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు(విద్య),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారని ప్రిన్సిపల్ డాక్టర్ వీ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో మొత్తం 131 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జేకేసి కోఆర్డినేటర్ డాక్టర్ కె అపర్ణసీతారామ్, ఎంటార్స్ యూనిస్‌ఖాన్,అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్రాల నుంచి రూ. 33 లక్షల విలువైన సెల్ ఫోన్లు రికవరీ



బాధితులతో సమావేశమైన అదనపు ఎస్పీ సుప్రజ

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పోగొట్టుకున్న రూ. 33 లక్షల విలువైన 220 సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు గురువారం పోలీస్ కార్యాలయంలో ఆయా బాధితులకు సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ చాలా సందర్భాల్లో పోగొటుకున్న లేక చోరీకి గురైన సెల్‌ఫోన్ల గురించిన సమాచారం తెలియక బాధితులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏం చేయాలో దిక్కు తోచలేని పరిస్థితుల్లో పోలీసులను వారు ఆశ్రయిస్తున్నారన్నారు. పోగొట్టుకున్న లేక చోరీకి గురైన సెల్ ఫోన్ల వివరాల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, వాటిని వెతికి బాధితులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రికవరీ అయిన సెల్‌ఫోన్‌లలో మన జిల్లా, మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు తమిళనాడు -3, కేరళ -1, వెస్ట్ బెంగాల్ -1, అస్సాం -1, కర్ణాటక -1 సెల్ ఫోన్లతో పాటు సుమారు రూ.33 లక్షల విలువైన 220 సెల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్న లేదా చోరీకిగురైన వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831574కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నా మని తెలిపారు. సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్ కాల్స్ కు భయపడకుండా ఆ ఫోన్ కాల్స్ ను వెంటనే బ్లాక్ చేసి మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్ గాని లేదా జాతీయ సైబర్ భద్రత టోల్ ఫ్రీ నెంబర్ 1930 నంబర్‌కు గాని ఈ సమాచారం ఇచ్చి క్షేమంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుల్ ఇమాం సాహెబ్, గౌస్ బాషా, మానస, సీసీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను అదనపు ఎస్పీ అభినందించారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీలలో స్థానిక బ్రాడీపేటలోని సీ పీఎం జిల్లా కార్యాలయంలో జరిగే జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మహాసభల ప్రచార పోస్టర్‌ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 14న ఉదయం పది గంటలకు జెండా ఆవిష్కరణతో సభ ప్రారంభమై 12 గంటల వరకు జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈమని అప్పారావు, ఎన్ భావన్నారాయణ, కె నళినికాంత్, టి.శ్రీనివాస రావు, కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలి

గుంటూరు(విద్య),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి ఆటల్లో ప్రోత్సహించాలని, అప్పుడే వారు ఒత్తిడిని అధిగమిస్తారని ఇంటర్‌బోర్డు ఆర్ఐఓ జీకే జుబేర్ అన్నారు. ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బీఆర్ స్టేడియంలో నిర్వహించిన వార్షిక క్రీడా ఉత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థలలో క్రీడా పోటీలు తక్కువగా జరుగుతాయని, ఇటువంటి స్పోర్ట్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆటల పోటీల వల్ల విద్యార్థులలో శారీరక దారుఢ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని అన్నారు. విద్యాసంస్థల చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్స్ విజయ భాస్కర్‌రెడ్డి, జోసెఫ్‌రెడ్డి, సీఈఓ సన్నీ హన్రిక్స్, ఏజీఎం ఏడుకొండలు, డీటీఎం శేషగిరిబాబు, ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పీఎఫ్ రుణాల మంజూరుకు వినతి

గుంటూరు(విద్య),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగర అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసును గురువారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు 87 మంది ఉపాధ్యాయులకు రూ. 4 కోట్ల మేరకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. తొలగించిన బోధనేతర సిబ్బందికి కంటింజెంట్ నిధులు ఇవ్వాలని, ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పది విద్యార్థులకు సాయంత్రంపూట అల్పాహారం ఇవ్వాలని కోరారు.



డాగ్.. డయాబెటిస్ !



- కుక్కల్లో ప్రబలుతున్న షుగర్ వ్యాధి
- 1 నుంచి 5 శాతానికి పెరుగుదల
- మితిమీరిన ఆహారమే కారణమంటున్న వైద్యులు
- పందెపు ఎద్దుల్లోనూ ఇదే సమస్య
- డయాలసిస్ యూనిట్ కోసం విజ్ఞప్తి

షుగర్ వ్యాధి మనుషులనే కాదు కుక్కలను కూడా అల్లాడిస్తోంది. ఈ మధ్య కాలంలో కుక్కల్లో షుగర్ వ్యాధి బాగా ప్రబలుతున్నట్లు పశు వైద్యులు గుర్తించారు. గతంలో డాగ్ డయాబెటిస్ కేసులు (కుక్కల్లో షుగర్ వ్యాధి) ఒక శాతం వరకు ఉండేవి. ఈ మధ్య కాలంలో ఐదు శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. గుంటూరులోని జిల్లా పాలీ క్లినిక్ వైద్యులు కూడా కుక్కల్లో షుగర్ వ్యాధి ప్రబలుతున్నట్లు గుర్తించారు.

గుంటూరు సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎక్కువ శాతం కుక్కలు షుగరు వ్యాధికి గురవుతున్నాయి. వివిధ సమస్యలతో ఆసుపత్రికి తీసుకువచ్చిన కుక్కలకు పరీక్షలు నిర్వహించగా షుగర్ వ్యాధి ఉన్నట్లు తేలుతుందని పశువైద్యులు చెబుతున్నారు. కుక్క రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ 76 ఎంజీ/డీఎల్ నుంచి 119 ఎంజీ/డీఎల్ వరకు ఉంటే షుగర్ సాధారణ స్థాయిలో ఉన్నట్లు భావిస్తారు. వ్యాధి బారిన పడిన కుక్కల రక్త నమునాల్లో గ్లూకోజ్ లెవెల్స్ 120 ఎంజీ/డీఎల్ నుంచి 160 ఎంజీ/డీఎల్ పైన ఉంటున్నట్లు తేలింది. షుగర్ వ్యాధి సోకిన కుక్కలు ఎక్కువగా నీళ్ల తాగటం, చాలా నీరసంగా ఉండటం, ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయటం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, కంటిలో శుక్లాలు కలిగి చూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతూ ఉంటాయని పశు ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.



అతి ప్రేమతో అనర్థాలు..

కుక్కల్లో షుగర్ వ్యాధి ప్రబలటానికి ప్రధాన కారణం మారిన ఆహారపు అలవాట్లేనని తెలుస్తోంది. వాటి మీద ఉన్న అతి ప్రేమతో ఏదిపడితే అది తినిపించటం ప్రాణాల మీదకి తెస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. బిర్యానీ ఎక్కువగా తినిపించటం, పిజ్జాలు, బర్గర్‌లు పెట్టడం, జంక్ ఫుడ్, శీతల పానీయాలు అతిగా తాగించడం, శారీరక శ్రమ లేకపోవటం వలన ఊబకాయం ఏర్పడి కుక్కలు షుగర్ వ్యాధి బారిన పడుతున్నట్లు గుర్తించారు. వయస్సు ప్రభావం కూడా వ్యాధికి కారణంగా కనిపిస్తుంది. కుక్క మధ్య వయస్సుగా పిలిచే 5 సంవత్సరాల తర్వాత చాలా వాటిల్లో వ్యాధి లక్షణాలు ఉంటున్నట్లు తెలుస్తోంది. కుక్కల్లో ఎక్కువగా కనిపించే చర్మ వ్యాధుల నివారణ



కొరకు వినియోగించే స్టెరాయిడ్స్ దీర్ఘకాలిక వాడకం షుగర్ వ్యాధి ముప్పును తెచ్చిపెడుతోంది.

గన్నవరం వెళ్లాల్సి వస్తుంది..

గుంటూరులోని జిల్లా పశువైద్యశాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి రిఫరల్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఎక్కువ కేసుల్లో కిడ్నీ ఫెయిల్యూర్ కన్పిస్తుంది. అటువంటి సందర్భంలో కిడ్నీ ఫెయిల్ అయిన పశువు జీవిత కాలం పెంచటానికి డయాలసిస్ మాత్రమే చివరి అవకాశం అని వైద్యులు చెబుతున్నారు. గుంటూరులోని పాలీ క్లినిక్‌లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివలన కిడ్నీ ఫెయిల్యూర్ కేసులను దూరంలో ఉన్న గన్నవరం వెటర్నరీ కాలేజికి పంపే ఇబ్బందులు తప్పుతాయని అంటున్నారు.

పందెపు ఎద్దుల్లోనూ...

ఈ మధ్య కాలంలో పందెపు ఎద్దుల్లోనూ షుగర్ వ్యాధి గుర్తించినట్లు గుంటూరు పాలీ క్లినిక్ వైద్యులు తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి వచ్చిన ఎద్దులకు నిర్వహించిన యూరిన్, రక్త పరీక్షల్లో షుగర్ వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలిపారు. గుంటూరు పాలీ క్లినిక్‌లో కిడ్నీ ఆరోగ్యాన్ని తెలియజేసే క్రియాటిన్ లెవల్స్ కూడా పరీక్షల ద్వారా నిర్ధారిస్తున్నారు. అనారోగ్యంతో వచ్చిన పశువులకు లివర్‌లో టోటల్ ప్రోటీన్, ఆల్బ్యుయుమిన్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, ఆల్బ్యుయుమిన్ పాస్పటేట్, కిడ్నీలో క్రియాటిన్, బ్లడ్ యూరియా పరీక్షలు చేసి రోగాన్ని గుర్తిస్తున్నారు.

ఇన్సులిన్ వాడకమే శరణ్యం



కుక్కల్లో షుగర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత ఇన్సులిన్ వాడుతున్నట్లు గుంటూరు పాలీ క్లినిక్ వైద్యులు చెబుతున్నారు. బరువును బట్టి ఇన్సులిన్ వేయాల్సిన యూనిట్లు నిర్ణయిస్తామని చెబు తున్నారు. ఉదాహరణకు కుక్క బరువు సుమారు ఐదు కిలోల వరకు ఉంటే 4 నుంచి 5 యూనిట్లు ఇన్సులిన్ వేయాలని చెబుతున్నారు. ఇన్సులిన్‌లో కూడా మూడు రకాలు ఉన్నట్లు తెలుస్తోంది. షార్ట్-యాక్టింగ్ ఇన్సులిన్, ఇంటర్మీడియట్ -యాక్టింగ్ ఇన్సులిన్, లాంగ్-యాక్టింగ్ ఇన్సులిన్ ఉన్నట్లు చెబుతున్నారు. అత్యవసర చికిత్సలు, ఆపరేషన్ సమయం లో షార్ట్-యాక్టింగ్ ఇన్సులిన్ వాడుతున్నారు. దానివల్ల కుక్క రక్తంలో గ్లూకోజ్ స్థాయి వెంటనే స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యకర ఆహారం పెట్టాలి



ఎంతోమంది చాలా ప్రేమతో కుక్కలను పెంచుకుంటున్నారు. వాటికి ఆరోగ్యకర ఆహారం పెట్టాలి. ఇష్టం వచ్చినట్లు ఆహారం ఇవ్వటం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కూల్ డ్రింక్స్ తాపడం, చాక్లెట్‌లు పెట్టడం వంటివి హానికరం. కుక్కలకు చేపలు అసలు పెట్టకూడదు. వాటిని ప్రేమతో పెంచేటప్పుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా యజమానుల పైనే ఉంటుంది.

- మంగళగిరి రత్నజ్యోతి, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

డయాలసిస్ యూనిట్ ఉంటే బాగుంటుంది



గుంటూరు జిల్లా పశువైద్యశాలకు డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కిడ్నీకి సంబంధించిన కేసులకు ఇక్కడ మెరుగైన వైద్యం చేసే అవకాశం ఉంటుంది. డయాలసిస్ సకాలంలో ప్రారంభించటం వల్ల అనారోగ్యం బారిన పడిన పశువుల జీవిత కాలం పెంచే అవకాశం ఉంటుంది.

- లక్కింశెట్టి నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

ఉత్తరాఖండ్‌దే పైచేయి

- తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యం



అభిమన్యు 72 పరుగులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్‌పై ఉత్తరాఖండ్ జట్టు పైచేయి సాధిస్తుంది. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 95 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 349 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు అభిమన్యు 72, అనయ నేగి 71, మయాంక్ ముదిలా 63, కుశగ్ర కోరంగ 54 పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్ ఆదిత్య రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

అమరావతిలో 'ఫైవ్'స్టార్ హోటల్స్

విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో స్టార్ హోటల్స్ ఏర్పాటుకు తీవ్ర పోటీ నెలకొంది. అతి త్వరలో ఐదు స్టార్ హోటల్స్ ఏర్పడబోతున్నాయి. స్టార్ హోటల్స్ ఏర్పాటుకు ఆయా సంస్థల యాజమాన్యాల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. నూతన పర్యాటక పాలసీ తీసుకు వస్తున్న నేపథ్యంలో, హోటల్స్ రంగం ఎంతో ఆసక్తిగా ఉంది. ప్రస్తుతం భూ ప్రతిపాదనల దశలో ఉన్నాయి. అమరావతిలో ముందుకు వచ్చిన సంస్థలను చూస్తే ఐఆర్‌సీటీసీ, అట్మాస్పియర్ కేర్, ఒబెరాయ్ గ్రూప్, తాజ్ గ్రూప్‌కు చెందిన ఐహెచ్‌సీఎల్, రహేజా గ్రూపులు ఉన్నాయి. ఐర్‌సీటీసీ 3 ఎకరాలు, అట్మాస్పియర్ కేర్ కు 10 ఎకరాలు, ఐహెచ్‌సీఎల్‌కు 10 ఎకరాలు, ఒబెరాయ్ గ్రూప్‌కు 10 ఎకరాలు, రహేజా గ్రూప్‌కు 5 ఎకరాల చొప్పున కావాల్సి ఉంది. రహేజా గ్రూప్ విజయవాడ లో కూడా కృష్ణానది ఒడ్డున స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి ఐదెకరాలు కావాల్సి ఉంది. వాంటేజ్ గ్రూప్ మచిలీపట్నంలోని మంగినపడి బీచ్ దగ్గర స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి 10 ఎకరాలు కావాల్సి ఉంది. ఆయా సంస్థలతో తుది అగ్రిమెంట్లు చేసుకునే క్రమంలో భూములను స్వాధీనం చేసే అవకాశం ఉంది.

టమాట లోడు లారీ బోల్తా



గుంటూరు - చిలకలూరిపేట ఎన్‌హెచ్-16పై బుడంపాడు బైపాస్ వద్ద కర్ణాటక నుంచి టమోటా లోడుతో వస్తున్న లారీ డివైడర్‌ని ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. **- గుంటూరు**

లాలుపురం శివారులో యువకుడి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- నమ్మకంగా తీసుకు వచ్చి రాళ్లతో కొట్టి చంపిన నిందితులు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌పురం రోడ్డులోని భవానిపురంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. హతుడిని లాలాపేటకు చెందిన షేక్ మస్తాన్‌షరీఫ్ (40)గా గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ షరీఫ్ లాలాపేటలోని బోసుబొమ్మ సెంటర్‌లో మొబీనా మెటల్ స్టోర్ అనే దుకాణం నిర్వహిస్తున్నాడు. తన తండ్రితో కలిసి వ్యాపారం చేస్తున్నాడు. అతనికి, భార్యకి మనస్పర్థలు వచ్చి 2020లో విడిపోయారు. ఇదిలాఉంటే గతంలో వీరి షాపులో ఆర్ అగ్రహారం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొంతకాలం పని చేసింది. ఆమెతో మస్తాన్ షరీఫ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ తరువాత కొంత కాలానికి ఆమెను పని నుంచి తీసివేశారు. అయినప్పటికీ వారి మధ్య సంబంధం కొనసాగుతూనే ఉంది. ఆర్‌అగ్రహారంకు చెందిన ఆమెకు భర్త లేకపోవడంతో ఇతను నేరుగా ఇంటికి వెళ్తూ ఉండేవాడు. మద్యం తాగుతూ అక్కడే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇది ఆమె కుమారుడుకి ఇష్టం లేదు. షరీఫ్ రాకపట్ల ఆమె కుమారుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నాడు. మా ఇంటికి వద్దు.. మా పరువు పోతుంది.. అని పలుసార్లు షరీఫ్‌ని వారించాడు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆగ్రహించిన యువకుడు ఎలాగైనా షరీఫ్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. దీంతో షరీఫ్ దుకాణంలో పని చేసే సంగడిగుంటకు చెందిన సుభానితో కలసి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో ఈ నెల 10న సాయంత్రం షరీఫ్‌ను షాపులో పని చేసే సుభాని గాంధీపార్క్‌కు అని చెప్పి బయటకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమె కుమారుడుతోపాటు మరో వ్యక్తి కలిశాడు. నలుగురు లాలుపురం శివారు భవానిపురం వద్ద ఖాళీ స్థలాల్లో మద్యం తాగారు. అక్కడ ముగ్గురు కలిసి షరీఫ్‌పై రాళ్లతో దాడి చేసి హత మార్చారు. మృతదేహం కనిపించకుండా లోపల ముళ్ల చెట్ల వైపు పడేశారు. అయితే రాత్రికి షరీఫ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సుభానీని అడిగారు. అయితే షరీఫ్‌కు వాంతులు కావడంతో జీజీహెచ్‌కు వెళ్లాడని చెప్పాడు. అనుమానం వచ్చి సుభానిని గట్టిగా అడగ్గా షాపులో పని చేసిన మహిళ కుమారుడు కొట్టాడన్నారు. గురువారం ఓ ఆటో డ్రైవర్ బహిర్భూమికి అటుగా వెళ్లగా మృతదేహం బయటపడింది. విషయం తెలిసిన వెంటనే సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ వంశీధర్ సంఘటనా స్థలానికి వెళ్లారు. హత్యకు గురైన షరీఫ్ అక్క ఆరీఫా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్యలో పాల్గొన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కాగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నన్ను బెదిరించి లొంగదీసుకున్నాడు

- రెండేళ్లు నాకు నరకం చూపించాడు
- రోజుకు రూ.4 వేలు చొప్పున వసూలు చేశాడు
- వైసీపీ నేత నుంచి ప్రాణ రక్షణ కల్పించండి
- మీడియా ముందు బాధిత మహిళ ఆవేదన



గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాను వైసీపీ నాయకుడునని, తనకు వైసీపీ నేతలు అప్పిరెడ్డి, మద్దాలి గిరి తెలుసునని చెప్పి నన్ను బెదిరించి లొంగదీసుకున్నాడు, ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసి తనను రెండేళ్ల పాటు చిత్రహింసలకు గురి చేసి నరకం చూపించాడని బాధిత మహిళ వాపోయారు. గురువారం నగరంపాలెంలోని ఓ న్యాయవాది నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను చిలకలూరిపేట రోడ్డులో మరమరాల బట్టి, కిరాణాషాపు నిర్వహిస్తుంటానని తెలిపారు. సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వెంగళాయపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావు నాపై కన్నేసి నన్ను లొంగదీసుకునేందుకు మా షాపులో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడన్నారు. ఏమీ తెలియనట్లు షాపు వద్దకు వచ్చి తాను వైసీపీ నాయకుడిని అని, మీ షాపులో దొంగతనం జరిగిందంట కదా పోలీసులతో మాట్లాడి దొంగలను పట్టుకునేలా చేస్తానని నమ్మించాడని వివరించారు. ఫోన్ నంబర్ తీసుకొని బెదిరించి తనను లొంగదీసుకున్నాడని అన్నారు. ఆ తర్వాత నగ్నంగా వీడియోలు, ఫొటోలు తీసి వాటిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరించి ప్రతి రోజూ తన నుంచి నాలుగు వేల రూపాయలు వసూలు చేశాడని వివరించారు. ఆ తర్వాత మనకు మధ్యలో నీ భర్త అడ్డుగా ఉన్నాడని, ఆయన్ను తప్పించేందుకు విష ప్రయోగం చేయాలంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చాడన్నారు. దీనిలో భాగంగానే ఓటిక్షగాడిని చంపాడన్నారు. వైసీపీ నాయకుడు నాగేశ్వరావు, ఆయన అనుచరులు తమ పట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించారన్నారు. వారికి భయపడి మా ముగ్గురు పిల్లలు స్కూలు, కాలేజీలకు వెళ్లడం మానేశారన్నారు. తన భర్తను అనేకసార్లు చంపడానికి ప్రయత్నించాడన్నారు. నిందితుడు నాగేశ్వరరావు ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. నాగేశ్వరరావు, ఆయన అనుచరుల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. తాము ఫిర్యాదుచేసి 20రోజులు దాటినా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు. **కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో..**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందన్న ధైర్యంతో బాధిత మహిళ ముందుకొచ్చి పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఎస్పీని, అదేవిధంగా నగరంపాలెం, మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమీక్షలు.. ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

కొన్ని పంచాయతీలను విలీనం చేసి పదేళ్ల దాటిందని, అయితే పరిశుభ్రమైన తాగునీటిని అందించలేని పరిస్థితి ఉందన్నారు. గతంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రుణాలు మంజూరై ఉన్నాయని, అయితే కొన్ని పనులు ప్రారంభించి నిలుపుదల చేశారన్నారు. ఆ పనులను కొనసాగించడమా... అంచనాలను సవరించి కొత్తగా చేపట్టడమా అనే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ స్పందించి మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో భాగస్వామ్యమైన మంగళగిరి నియోజకవర్గానికి కూడా మౌలిక సదుపాయాల కల్పన పనులను పొడిగించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు పూర్తి చేస్తామన్నారు.

సూచనలు.. లక్ష్యాలు

కలెక్టర్ల సదస్సు చివరి రోజున వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్లకు కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మూడున్నర నెలల్లో పీఎంఏవై అర్బన్ కింద 4200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గుంటూరు కలెక్టర్‌కు లక్ష్యాన్ని నిర్దేశించారు. పీఎంఏవై అర్బన్‌ని 2026 మార్చి వరకు కేంద్ర ప్రభుత్వం గడవు పొడిగించినందున సాధ్యమైనంత త్వరగా పెండింగ్ గృహాలు పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. అటవీ శాఖ క్లియరెన్స్‌లు జిల్లాలో ఏడు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా విస్తరిస్తున్నందున ప్రతీ ప్రాంతానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఒక బ్లూ ప్రింట్ తయారు చేసి అమలు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్లానింగ్ చేసుకుని ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంగళగిరిలో ఐటీ పార్కు నిర్మాణానికి 200 ఎకరాల భూమిని గుర్తించాలని ఆదేశించారు. అమరావతిని బుద్దిస్టు సర్క్యూట్‌గా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందించాలన్నారు. మానవవనరులు, గృహ నిర్మాణం, చైల్డ్ వెల్‌ఫేర్, వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఇలా దాదాపు అన్ని విభాగాలలో బాపట్ల జిల్లాకు సంబంధించి సమీక్షలో చర్చించించారు. రాబోయే నాలుగున్నరేళ్లలో ఆయా రంగాలలో సాధించాల్సిన పురోగతితో పాటు జిల్లాలో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉన్న వనరుల లభ్యత వంటి అంశాలన్నీ సదస్సులో చర్చకు వచ్చాయి

ఓఆర్ఆర్‌తో గుంటూరు - విజయవాడ - అమరావతి కలిసిపోతాయి


అమరావతి ఔటర్ రింగురోడ్డు డీపీఆర్‌ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2026 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఔటర్ రింగురోడ్డు అభివృద్ధితో గుంటూరు, అమరావతి, విజయవాడ, వీటి మధ్య ఉన్న గ్రామాలు కలిసిపోతాయని సీఎం చెప్పారు. దీంతో పట్టణీకరణ పెరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసి ప్రాధాన్యక్రమంలో పనులను నిర్ణయించి, ఆ దిశగా వాటిని చేపట్టాలని సూచించారు.

వరప్రదాయినికి వీడిన గ్రహణం

సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా నిలిచే గోదావరి జలాల తరలింపు పథకానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. కూటమి ప్రభుత్వం ఈ పథకం నిర్మాణాన్ని పట్టాలెక్కిస్తూ కలెక్టర్ల సదస్సులో సీఎం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి పెన్నా నదుల అనుసందానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్మాణాన్ని నిలిపివేసింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. నిర్మాణ వ్యయం రూ.6020 కోట్లు కానున్నది. 466 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ పథకం పూర్తి చేస్తే సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు మహర్దశ పడుతుంది. గోదావరి, పెన్నా అనుసందానం కుడి కాల్వ ఆయకట్టుకు జీవం పోస్తుంది.

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో సంఘ్ ఘన విజయం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికల్లో దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ (ఎస్‌సీఆర్‌ఈఎస్) ఘన విజయం సాధించింది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో గుంటూరు డివిజన్ వ్యాప్తంగా జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు గురు వారం ఉదయం పట్టాభిపురంలోని గుంటూరు డీఆర్‌ఎం కార్యాలయం ఆవర ణలో నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా మొత్తం 4060 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 2036 ఓట్లను సంఘ్, 1660 ఓట్లను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు సాధించాయి. దీంతో 376 ఓట్ల ఆధిక్యంతో ఎంప్లా యీస్ సంఘ్ గెలుపొందినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఫలితాలు వెలువడగానే సంఘ్ నాయకులు విజయోత్సవ ర్యాలీ, గెలుపు సంబరాలను నిర్వహించారు. పరస్పరం మిఠాయిలు పంచుకొని ఆనందోత్సాహంతో సంబరాలు చేశారు. ఈసందర్భంగా సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణ య్య మాట్లాడుతూ రైల్వే కార్మికులు సంఘ్‌కు అండగా నిలిచినందుకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా సంఘ్ ఇచ్చిన హామీల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలపై సాధ్యమైనంత త్వరగా అధికారులతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేయించి చర్చిస్తామన్నారు.



రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు విజయోత్సాహం

రిటర్నబుల్ ప్లాట్లకు ఈ- లాటరీ

తుళ్లూరు, డిసెంబరు 12: అమరావతి రాజధాని అమరావతి రైతుల ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లకు విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ నిర్వహించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రాజధానిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ రాజకుమారి తెలియజేశారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ-లాటరీ నిర్వహించారు. మొత్తం 14 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్సిల్-130, కమర్షియల్ -113 ప్లాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఆఫీసు మేనేజర్ వల్లభనేని శ్రీనివాసరావు, ఎస్టేట్ జాయింట్ డైరెక్టర్ వీ.డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భీమారావు స్వర్ణమేరి, సాయి శ్రీనివాస్ నాయక్, పద్మావతి, హస్సేన్ సాహెబ్, కె.ఎస్.భాగ్యరేఖ, రవీందర్, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరావు, తహసీల్దార్ అరుణాదేవీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విజయవాడ సీఆర్డీయే కార్యాలయంలో నిర్వహించిన లాటరీలో రైతులకు ప్లాటు పత్రాలు అందజేస్తున్న అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ రాజకుమారి

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 725 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 223 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 82 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 51 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 139 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 975 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

78 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో నామమాత్రంగా 78 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠధర రూ.10,000, మోడల్ ధర రూ.10,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,350, గరిష్ఠధర రూ.10,311 మోడల్ ధర రూ.10,311 పలికాయి.

నేడు లోకేశ్ ప్రజాదర్బార్

తాడేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి కరకట్ట వద్ద మంత్రి లోకేశ్ నివాసంలో జరుగుతున్న ప్రజాదర్బార్ శుక్రవారం ఉదయం 6 గంటల వరకు జరుగు తుందని లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గ ప్రజల కోసం లోకేశ్ అందుబాటులో ఉంటారని 6 నుంచి 7 గంటలలోపు వచ్చినవారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

దుగ్గిరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోడిపందెం స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేఆర్‌కొండూరులోని తోటల్లో కోడిపందెం వేస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఐ వెంకటరవి, మరో ముగ్గురితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మిగిలిన వారు పరారయ్యారు. కాగా దాడిలో 11కోళ్లు, 10బైక్‌లు, 11వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కోడిపందెం వేసిన వారంతా తెనాలి, చినరావూరు పరిసర గ్రామాలకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

ఘర్షణపై కేసు నమోదు

పెదనందిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఘర్షణ పడిన సంఘటన పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు మండలపరిధిలోని నాగులపాడు వద్ద పి.వంశీకృష్ణ అనే వ్యక్తిని గాలిమేలు వంశీ అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఘర్షణ పడ్డారు. గాలిమేలు వంశీ పి.వంశీకృష్ణను బండరాయితో తలపై మోదగా రక్తస్రావమైంది. ఎస్‌ఐ మధుపవన్ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటో డ్రైవర్

● భార్య భర్తలకు తీవ్రగాయాలు

తాడికొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆటో నడుపుతు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన ఘటన నిడుముక్కల గ్రామంలో గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన చెరుకూరి సత్యనారాయణ, పవిత్రలు ద్విచక్ర వాహనంపై గుంటూరులో పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నారు. అమరావతి నుంచి గుంటూరు వైపు ఆటో చేపల లోడుతో వెళ్తున్నాడు. ఆటో డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో నిడుముక్కల గ్రామం శివారు వద్దకు వచ్చే సరికి ఆటో డ్రైవర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో సత్యనారాయణ, పవిత్రల కాళ్లు, చేతుల ఎముకలు విరిగిపోయి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే ఉన్న స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించారు.

గుండెపోటుతో యువకుడి మృతి

దుగ్గిరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలకు చెందిన యువకుడు తిరుపతిలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న దుగ్గిరాలకు చెందిన మోకా శ్రీనివాసరావు(27), శబరిమలకు వెళ్లేభక్తులతో వెళుతున్న బస్సులో వెళ్లాడు. అయ్యప్ప దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. తిరుపతి వరకూ వచ్చిన భక్తులు, తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని దర్శించుకునేందుకు వేరే వాహనాల్లో కొండపైకి వెళ్లారు. ఈలోగా బస్సులో వేచియున్న శ్రీనివాసరావుకు బస్సు కండిషన్‌ను పరిశీలించిన అనంతరం ప్రక్కనే కూర్చునే ప్రయత్నం చేస్తూ కుప్పకూలిపోయాడు. కిందపడిపోయిన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతి చిన్న వయస్సులో గుండెపోటుకు గురైన శ్రీనివాసరావుకు, భార్య, మూడేళ్లలోపు వస్సుగల ఇద్దరు ఆడపిల్లలున్నారు. శ్రీనివాసరావు మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతుండగా రామ్‌నగర్‌లో విషాదం అలముకుంది. అతి చిన్నవయస్సులో మృత్యువు కబళించిన, యువకుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్‌జేడీకి ఏపీటీఎఫ్ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు(విద్య),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం హయాంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ నిరంకుశ వైఖరితో, చిన్న కారణాలతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై అక్రమంగా విధించిన క్రమశిక్షణాచర్యలను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శిలు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కోత విధించిన ఇంక్రిమెంట్లు వెంటనే పునరుద్ధ రించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీ నారాయణ, జిల్లా కార్యదర్శి లు మూర్తి, జి. దాస్, జహంగీర్, వీరయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్యకేంద్రంలో క్షీణించిన పారిశుధ్యం

● ఒక పక్క మదుగు.. మరో పక్క పాములు
● భయం భయంగా సిబ్బంది విధులు
● పట్టించుకోని అధికారులు



సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ పేరుకు పోయిన మదుగు, పిచ్చి మొక్కలు



ప్రత్తిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోగాలు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి.. నీరు నిల్వ ఉండకుండా చూడాలి అంటూ.. ప్రజలకు ఆరోగ్య సూత్రాలు చెప్పే ప్రభుత్వ వైద్యశాల అపరిశుభ్ర వాతావరణంలో కునారిల్లుతోంది. జబ్బుతో వైద్యశాలకు వచ్చే రోగులకు ప్రశాంత వాతావరణం ఉండాల్సిన చోట పిచ్చి మొక్కలు, రాళ్ల రప్పలు, గుట్టలు దర్శనమిస్తున్నాయి. అడుగు తీసి అడుగు వేయడానికి వీల్లేకుండా మదుగు దర్శనమిస్తోంది. అంతేకాకుండా వైద్యశాలలో పైప్‌లైన్ పగిలి పోవడం వల్ల మురుగు నీరు బయటకు వచ్చి దుర్వాసన వస్తుంది. దీనికి తోడు మదుగు పేరుకు పోవడం వల్ల పాములు వైద్యశాలలోని సిబ్బందిని అప్పుడప్పుడు పలకరించి పోతున్నాయి. ఇక్కడ నెలకొన్న వాతావరణం వైద్యశాలను ఆనుకుని ఉన్న ఇళ్ల వారికి ఇబ్బందికరంగా మారింది.

ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం కొంత కాలంగా మదుగుతో మురికి కూపంగా మారి పోయింది. ఇటీవల సామాజికలో నూతన బిల్డింగ్ నిర్మాణం జరిగింది. అయితే లోపలి పనులు పూర్తి కాకపోవడంతో బిల్డింగ్‌ను ఇంకా ప్రారంభించలేదు. దీంతో పాత బిల్డింగ్‌లోనే వైద్యశాలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వైద్యశాల చుట్టూ పిచ్చి మొక్కలతో పాటు మురికి నీరు కూడా నిల్వ ఉంటున్నాయి. ప్రధాన రహదారిలో మురుగునీరు పోయే కాలువలు లేక పోవడంతో వైద్యశాలలోనే నిల్వ ఉంటుంది. దీనికి తోడు ఒక పైప్ కూడా పగిలిపోవడంతో దుర్వాసన వస్తోంది. ఈ ప్రభావంతో చాలా రోజులుగా చుట్టుపక్కల గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అనేక మార్లు చుట్టు పక్కల వారు వైద్యులకు ఫిర్యాదులు చేసినా ఏ మాత్రం ఫలితం లేకుండా పోయింది. అంతే కాకుండా మదుగు బాగా ఎక్కువగా ఉండటంతో రాత్రి పూట వైద్యశాలలోనికి పాములు వస్తున్నాయి. దీంతో రాత్రి పూట విధులు నిర్వహించే సిబ్బంది బిక్కు బిక్కు మంటూ ఉండాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యశాల చుట్టూ పిచ్చి మొక్కలు మొలచి అడుగు పెట్టడానికి కూడా భయంకరంగా ఉన్నా దీనిని బాగు చేయించాలనే ఆలోచన కూడా లేకుండా ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు నీరు పోయే కాలువేది

వైద్యశాలలోని మురుగు నీరు బయటకు వెళ్లేందుకు కాలువ లేదు. ఇక్కడి కాలువ పూర్తిగా పూడి పోయింది. దీంతో మురుగునీరు మొత్తం వైద్యశాలలోని మదుగులో ఇంకి పోయి దుర్వాసన వస్తోంది. అంకమ్మగుడి నుంచి వైద్యశాల, తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి మురుగు కాలువ వెళ్లవలసి ఉంది. కాని అది పూర్తిగా పూడి పోయి కాలువ రూపు రేఖలు కూడా లేకుండా పోయింది.

వర్షభయంతో అన్నదాతలు

● యంత్రాలతో వరికోతలు, నూర్పిళ్లు ముమ్మరం
● ఆరబెట్టిన ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్న తీరు



మోరంపూడి రోడ్డుపై ధాన్యాన్ని లారీలకెత్తుతున్న రైతులు



రైతులు ట్రాక్టర్‌లలో తరలిస్తున్న ధాన్యం

దుగ్గిరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో దక్షిణ కోస్తాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రాయలసీమ జిల్లాలో పలుచోట్ల ఇప్పటికే కుండపోత వర్షాలు కురుస్తున్న నేప థ్యంలో మరోమారు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మండలగ్రామాల్లో పలుచోట్ల వరికోత యంత్రాల తో కోతలు ముమ్మరం చేశారు. పదిరోజుల క్రితం నేలకు ఒరిగిన పంట కోయిద్దామంటే కూలీల కొరతతో రెట్టింపు ఖర్చవుతోంది. ఎక్కువవుతోందని వాపోన్నారు. రోడ్లపైన, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారు లు ధాన్యాన్ని గోతాముల్లో నింపి హడావిడిగా లారీల్లో తరలిస్తున్నారు. మరోవైపు రైతులు గోతాముల్లో నింపే సమయం కూడా ఉంటుందో హఠాత్తుగా వర్షం పడు తుందోనన్న భయంతో నేరుగా ధాన్యం ట్రాక్టర్‌లలో నింపి ఇండ్లకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.1300కు పడిపోయిన ధర

తలకు మించిన భారమైనా, రెట్టింపు ఖర్చైనా తప్పని పరిస్థితుల్లో వర్షం భయంతో వారం రోజులుగా పెద్దఎత్తున వరికోతలను కొనసాగిస్తున్నారు. ఈ నేప థ్యంలో ఒక్కసారి గా రైతుల అవసరాల కోసం వచ్చిన ధరకు రైతులు పంటను తెగనమ్ముకునే క్రమంలో దళారు లు అప్పటి వరకూ ఉన్న రూ.1450 ధర రూ.1300కు పడిపోయింది. ప్రస్తుత అల్పపీడనం, రెండ్రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశముందని చెబుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

ఫిరంగిపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలో ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని, ట్రూఅప్ తదితర అన్ని రకాల అదనపు భారాలను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, ఆదానితో జరిగిన అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. అలాగే ఫిరంగిపురంలో మండల నాయకులు సీహెచ్ రామారావు, మార్పుల వెంగళరెడ్డిలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, జీ వెంకటేశ్వరరావు, వంగర రాఘవయ్య, కే కోటేశ్వరరావు, షేక్ ఖాజా మస్తాన్‌వలి, రమణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర బాలల వికాసమే లక్ష్యం



ఫిరంగిపురంలో కిశోరీ వికాసం సభలో పాల్గొన్న ఎంపీడీవో ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు

ఫిరంగిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల అధికారులు, సిబ్బంది బాలల సమగ్ర వికాసం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని సీడీపీవో పీజీజీ ప్రసూన అన్నారు. గురువారం ఫిరంగిపురంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన కిశోరీ బాలికల వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీవో ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సులో ఉన్న బాలబాలికల ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యక్తిగత శుభ్రత, సామాజిక భద్రత, లింగ వివక్షలపై గ్రామ స్థాయిలో ప్రజలందరికీ అవగాహన కల్పించి ప్రతి ఆడబిడ్డ గౌరవంగా జీవించేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలికల విద్య ప్రాముఖ్యం, ఆరోగ్యం, రుతుక్రమ శుభ్రత, పౌష్టికాహారం, రక్త హీనత, చైల్డ్ హెల్ప్‌లైన్, అక్రమ రవాణా, పోక్సో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీహెచ్ వెంకటేశ్వర్లు, మాస్టర్ ట్రైనర్లు చంద్రశేఖరరెడ్డి, రూతమ్మ, చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకట్, సీహెచ్ వెంకటరమణ, సూపర్‌వైజర్ సీహెచ్ మహాలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయినులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వయ్యారిభామ నిర్మూలనకు కృషి

వట్టిచెరుకూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పార్థీనియం(వయ్యారీభామ)కలుపు మొక్క నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డబ్ల్యూసీఎల్ ఆర్ఎం సీతారామరాజు అన్నారు. మండలపరిధిలోని చింతపల్లిపాడులో గురువారం జాతీయ కలుపు మొక్కల నివారణ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి, జంతువులకు, పంటలకు పార్థీనియం మొక్క వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. దీని నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎం తేజేశ్వరరావు, ఎంఆర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో రైతు ప్లాట్ జీపీ ఫోర్జరీ చేసి అమ్మకం

తుళ్లూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతు ప్లాటును జీపీగా ఫోర్జరి చేసి అమ్ముకున్న దానిపై గురువారం తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్ బాబూరావు వివరాల ప్రకారం తుళ్లూరుకు చెందిన రైతు మోదేపల్లి శ్రీనివాసరావుకు అబ్బురాజు పాలెం రెవెన్యూలో 1900 గజాల రిటనబుల్ ప్లాటు సీఆర్డీఏ కేటాయించి, గతంలో రిజిస్ట్రేషన్ చేసింది. దానిని దాసరి రామ్మోహనరావు అనే వ్యక్తి జీపీ(జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ) మోదేపల్లి శ్రీను నుంచి చేసుకున్నట్టు ఫోర్జరి చేశాడు. ప్లాట్లును మరొకరికి అమ్మాడు. కొనుగోలు చేసిన వ్యక్తి ఇంకొకరికి అమ్మాడు. ఒరిజనల్ పత్రాలు రైతు శ్రీను దగ్గర ఉండగానే ఇద్దరు కొనుగోలు చేసినట్టు రికార్డు సృష్టించారు. బాధితుడు ఫిర్యాదు మేరక ఎస్ఐ బాబూరావు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గంగా వెంకటేశ్వరావు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ నాసరయ్య

తాడికొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని భూ సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కే.నాసరయ్య తెలిపారు. గురువారం లచ్చన్నగుడిపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కార్యాలయాలు చుట్టూ తిరగకుండా అధికారులే రైతుల వద్దకు వచ్చి భూ సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు. గుడిపూడిలో నిర్వహించిన సదస్సులో 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నూతలపాటి హనుమంతరావు, పంచాయతీ సెక్రటరి, వీఆర్వో చంద్రపాల్, ఎండోమెంట్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను గ్రామగ్రామాన జరుపుతోందని తహసీల్దార్ జే ప్రసాదరావు అన్నారు. మండలంలోని శిరంగిపాలెం గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 16 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో జే శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జేపీ షేక్ మస్తాన్ షరీఫ్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహ్మాన్, వీఆర్వో నాగేశ్వరరావు తదితర అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దుగ్గిరాల, డిసెంబరు 12: రెవెన్యూ, దేవదాయశాఖ, వక్ఫ్‌భూముల సమ స్యలన్నింటికీ ఒకేవేదికపై పరిష్కారం అందించేందుకే రాష్ట్రప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. పేరుకలపూడిలో గురువారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో జబీన్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు మంచి అవకాశమని, నేరుగా రైతుల వద్దకు వచ్చి అర్జీలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలకు సంబంధించి మూడు శాఖల అధికారులతో పాటు సబ్‌రిజిస్ట్రార్ కూడా హాజరవుతున్నారని, సదస్సులో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు పంపామని, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పెదకొండూరు, గొడవర్రు తోపాటు మూడు గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేశా మన్నారు. సదస్సులో మొత్తం 13అర్జీలు వచ్చినట్లు తహ సీల్దార్ తెలిపారు. ఎంపీటీసీ తాళ్ల అశోక్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో జాన్సన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కాకుమాను, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాండ్రపాడు గ్రామ రెవెన్యూ సభకు 3 అర్జీలు వచ్చిలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. గురువారం మండలపరిధిలోని పాండ్రపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సర్వే కోసం మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సదస్సులో స్పెషల్ ఆఫీసర్ మోహనరావు, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు, గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోవాలని శంకర్‌బాబు అన్నారు. మండలపరిధిలోని ఉప్పలపాడులో గురువారం భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఆరు ఆర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాహితి మోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలు సిద్ధం చేయాలి

● ఎంపీపీ హెప్సీబా



అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న శిక్షణ సిబ్బంది

పెదనందిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీపీ హెప్సీబా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయా ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. తొలుత జాతిపిత గాంధీజీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ వర్ధని, సీహెచ్‌వో ప్రసాద్ స్వామి, ఏపీఎం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భావి తరాలకు వనరులు అందించాలి

● జడ్పీటీసీ షేక్ గుల్జార్‌బేగం

కాకుమాను, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భావి తరాలకు సహజ వనరులు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ గురించి ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం మాట్లాడుతూ ప్రతి గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికారులు గ్రామాలను సస్యశ్యామలం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీ ఆర్డీ రవిబాబు, ఐసీడీఎస్, వెలుగు, ఆరోగ్య, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ షాపు తాళాలు పగలుగొట్టిన వైసీపీ మూకలు

తాడికొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ మూకలు పంచాయతీ షాపు తాళాలు పగలుగొట్టి షాపును ఆక్రమించుకొని దౌర్జన్యం చేసిన ఘటన కంతేరు గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే కంతేరులో పంచాయతీ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు నిర్మించారు. షాపులకు సంబంధించి 2023 డిసెంబర్ నెలతో కాలపరిమితి ముగిసింది. అప్పటి నుంచి షాపులకు వేలం పాట నిర్వహించలేదు. ఈ క్రమంలో నవంబరు 14వ తేదీన పంచాయతీ సమావేశంలో షాపులను ఖాళీ చేయించి బహిరంగ వేలం పాట నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఈనెల 2వ తేదీన పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను ఖాళీ చేయించి తాళాలు వేశారు. అయితే షాపు నెంబరు 6ను గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కర్రి ప్రసాద్ కుటుంబసభ్యులు షాపును అద్దెకు తీసుకున్నారు. అన్ని షాపుల వాళ్లతో పాటే ప్రసాద్ కుటుంబసభ్యులు ఖాళీ చేశారు. కాగా ఈనెల 9వ తేదీన కర్రి ప్రసాద్, మరియమ్మ, ఉదయభాస్కర్‌లు పంచాయతీ సెక్రటరి ఎండీఏ రహిమాన్ వద్దకు వచ్చి షాపును తమకే కేటాయించాలని బెదిరించారు. షాపు తమకు కేటాయించకపోతే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించారు. దీంతో అదేరోజు పంచాయతీ సెక్రటరి తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

షెడ్యూల్డు కులాల సంక్షేమ పథకాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ కోఆపరేటివ్ ఫైనాన్స్ సంస్థ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ సిబ్బందితో తమ కార్యాలయంలో షెడ్యూల్డు కులాల అభ్యున్నతికి అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన కింద మంజూరు చేయబడిన పథకాలను 1732 మంది లబ్ధిదారులకు ఈనెల 31వ తేదీ లోపల పంపిణీ చేయవలసిందిగా కార్యనిర్వాహక సంచాలకులను కోరారు. పథకాల పంపిణీ కార్యక్రమానికి తేదీలను ప్రాజెక్టు సంచాలకులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల వారితో సంప్రదించి ఆ వివరాలను కేంద్ర కార్యాలయానికి వెంటనే పంపవలసిందిగా ఆదేశించారు. 2024-25 సంవత్సరంలో సంక్షేమ బడ్జెట్‌లో ఆర్థిక సహాయ పథకాల అమలుకు కేటాయించిన 341 కోట్ల రూపాయల బడ్జెట్‌తో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆమోదం కోసం ప్రభుత్వానికి సమర్పించారని తెలిపారు. త్వరలో జిల్లా కార్యనిర్వహణ సంచాలకులతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో సమీక్ష నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ కే కృష్ణవేణి, కార్యనిర్వాహణ అధికారులు, మంగారావు, కామేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి నిత్యావసరాలు అందజేత

మంగళగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు విజయ హెల్త్‌కేర్ ట్రస్టు తరఫున చేయూతనందించారు. పట్టణంలోని రత్నాలచెరువు జెండా చెట్టు సెంటరులో నివాసం ఉంటున్న సోమల దేవి కడుపులో కణితతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్దనే ఉంటుంది. దేవి ఆర్థిక ఇబ్బందులను గురించి స్థానికులు ట్రస్టు ప్రతినిధులకు తెలియజేయడంతో కొల్లి లక్ష్మీగిరిధర్ సహకారంతో ట్రస్టు తరఫున నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు కాగితాల స్వాతి, సభ్యులు బొడ్డేటి రమేష్, నూతక్కి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మగడ్డ ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి



కృష్ణాయపాలెం గ్రామంలో నిమ్మగడ్డ రామ్మోహనరావు విగ్రహానికి నివాళులు అర్పించిన సీపీఎం నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత స్వర్గీయ నిమ్మగడ్డ రామ్మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన స్వగ్రామమైన కృష్ణాయపాలెంలో గురువారం సీపీఎం నేతలు ఘననివాళి అర్పించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ మంగళగిరి సమితి అధ్యక్షుడిగా, మండల అధ్యక్షుడిగా, శాసనసభ్యుడిగా పనిచేసిన నిమ్మగడ్డ నిస్వార్థ ప్రజాసేవకుడిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. మంగళగిరి ప్రాంతంలో పేదలు, రైతులు, కార్మికులు, కర్షకులకు కొండంత అండగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ రామ్మోహనరావు సతీమణి లక్ష్మీసామ్రాజ్యం, సోదరుడు మురళీకృష్ణ, కుమారులు నిమ్మగడ్డ బాల ప్రకాష్, దినకర్, కొరిటాల రాంబాబు, సీపీఎం నేతలు ఎం భాగ్యరాజు, ఎస్ రామరాజు, షేక్ జానీ, అత్తలూరి వీరవెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిమ్మగడ్డ రామ్మోహనరావు చిరస్మరణీయమైన సేవలు అందించారని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వర్ధంతి కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. నిమ్మగడ్డ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకర్‌రావు, సీపీఎం నేతలు రాఘవులు, ఎం రవి, చెంగయ్య, డి.వెంకటరెడ్డి, బి.కోటేశ్వరీ, డి.శ్రీనివాసకుమారి, పీ బాలకృష్ణ, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల పోరాటం విజయవంతం కావాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

తాడేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటం విజయవంతం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాగేశ్వరరావు ఆకాంక్షించారు. గురువారం కార్మికుల దీక్షలకు సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడారు. దీక్షల్లో కూర్చున్న సీఐటీయూ నేతలు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్‌రావు, కె.మేరీ, శాస్త్రి ఎం దుర్గారావులకు పూలమాలలు వేసి మద్దతు ప్రకటించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల దీక్షలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని చెప్పారు. అవసరమైతే పోరాటాన్ని రాష్ట్ర స్థాయిలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కోర్టు తీర్పులను ధిక్కరించి కార్మికులు వేసుకున్న గుడిసెలను కూల్చిన ఎంటీఎంసీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని గుడిసెల కూల్చివేత అన్యాయమని చెప్పారు. మంత్రి లోకేశ్ ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కే లక్ష్మి, వెంకమ్మ, ఆర్‌వి రాఘవయ్య, కూరపాటి స్టీవెన్, స్థానికులు, సీపీఐ నేత కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

మంగళగిరికి ఇంగ్లండ్ బౌద్ధ బిక్షువు ఆనందజ్యోతి



ఆనంద జ్యోతి భంతేతో మంగళగిరి బుద్ధ విహార ప్రతినిధులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత పర్యటనలో ఉన్న ఇంగ్లండ్ దేశానికి చెందిన బౌద్ధ భిక్షువు ఆనందజ్యోతి భంతే గురువారం మంగళగిరి విచ్చేశారు. మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు నివాసానికి విచ్చేసి ఇక్కడ జరుగుతున్న బౌద్ధ ధర్మ కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆనంద జ్యోతి భిక్షువు 1992లో ఇంగ్లండ్ నుంచి శ్రీలంక వెళ్లి అక్కడ బౌద్ధ ధర్మాన్ని అధ్యయనం చేసి భిక్షువుగా మారిపోయారని కృష్ణార్జునరావు తెలిపారు. ఆనాటి నుంచి శ్రీలంకతోపాటు థాయ్‌లాండ్, మయన్మార్, మలేషియా, భారతదేశంలోని అనేక బౌద్ధ క్షేత్రాలను సందర్శిస్తూ ఆయా క్షేత్రాల ఔన్నత్యాన్ని తెలుపుతూ గ్రంథాలను రచిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి బుద్ధ విహార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనకు నమోదు చేసుకోవాలి

15వతేదీ నాటికి గడువు ముగింపు : ఏవో లక్ష్మి

వట్టిచెరుకూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్త గ్రామాల పరిధిలో రబీ 2024 - 2025 పంటల బీమా పథకం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు నమోదు గడువు ఈనెల 15వ తేదీతో ముగుస్తుందని ఏవో కే లక్ష్మి వెల్లడించారు. రైతులు సత్వరమే తమ వాటాగా చెల్లించాల్సిన బీమా నగదును ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లతో మీసేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. జొన్న, మొక్కజొన్న, మినుము, శనగ, వేరుశనగ, పెసర పైర్లకు బీమా నగదు చెల్లించి విస్తీర్ణం, పేరు నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించండి: మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించాలని పుర పాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 34వ వార్డులో గురువారం జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఏఈ సునీల్ కుమార్, టీపీవో సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మామిళ్లపల్లిలో పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ బ్రహ్మయ్య

గ్రామాలలో అభివృద్ధి పనుల తనిఖీ

పొన్నూరు టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య ఆకస్మిక తనిఖీలు చేశారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి, పచ్చలతాటిపర్రు, మండల కేంద్రమైన చేబ్రోలులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణంతో పాటు మురుగు కాలువల నిర్మాణం, నాణ్యతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ ఎంఎస్ఎస్ ప్రసాద్, ఏఈ మదనమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి తగిన అవకాశాలు: డైరెక్టర్ వెంకటరెడ్డి

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు అవకాశాలు అందిస్తున్నాయని సైనిక్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ బ్రిగేడియర్ పి.వెంకటరెడ్డి చెప్పారు. తెనాలి మాజీ సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం గురువారం ఎన్జీవో కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సైనిక స్కూళ్లలో మాజీ సైనికుల పిల్లలు ప్రవేశాలకు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యుల పేర్లు నమోదులో దోషాలు ఉంటే సరి చేసుకోవాలన్నారు. మాజీ సైనికులు మృతిచెందితే ఇచ్చే మట్టి ఖర్చుల మొత్తాలను ప్రభుత్వం పెంచిందన్నారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యుల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచాలని జేసీవోల పిల్లలకు కూడా ఉపకార వేతనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వివాహ కానుక కింద రూ.50వేలు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక అధికారి గుణశీల, మాజీ అధికారి చారి, సుభాని, బాబురావు, మురళీకృష్ణ, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలి: వేణుగోపాల్

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకు అధికారి వేణుగోపాల్ చెప్పారు. పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆర్‌బీఐ సహకారంతో గురువారం సైబర్ నేరాల తీరుపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మెప్మా మేనేజర్ విజయకుమారి మాట్లాడుతూ, ఏ బ్యాంకు కూడా ఓటీపీ అడగబోదని, స్కాన్ చేయమని చెప్పదన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలను, ఏటీఎం నిర్వహణను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఎవరైనా మోసపోతే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఆర్‌పీ మంగయ్య, స్వాతి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

చందోలు రోడ్డులో అధ్వానంగా ప్యాచ్‌వర్క్‌లు

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెనాలి-చందోలు మార్గంలో ప్యాచ్ వర్క్ పనులు అధ్వానంగా చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దారుణంగా దెబ్బతిన్న రహదారులను కాస్త అయినా చక్కదిద్దాలని కూటమి ప్రభుత్వం తలపెట్టింది. అయితే ఆర్ అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులు నాసిరకంగా చేస్తున్నారు. ఈ మార్గంలో గత నాలుగు రోజులుగా గుంతలు పడిన రోడ్డును తారువేసి మెటల్‌చిప్స్ పరుస్తున్నారు. తారు సరైన పరిమాణంలో వాడకపోవడంతో రోడ్డంతా గులకరాయి లేచిపోయి ప్రమాదభరితంగా మారింది. రోడ్లపై లేచిన గులకరాళ్లు పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయి. వారం రోజుల వ్యవధి లోపలే వేసిన ప్యాచ్ అంతా సగం పైగా లేచిపోతూ ఉంది. కొంతమేర రహదారికి ఇరువైపులా మార్జిన్లు పల్లం కావడంతో డస్ట్ వేశారు. అది కూడా కొన్ని చోట్ల వేయకుండా వదిలేశారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి ప్యాచ్ పనులను సక్రమంగా చేసేలా చూడాలని, మార్జిన్‌లలో వదిలి వేసిన చోట డస్ట్ పోయించాలని పలువురు సూచిస్తున్నారు.



చందోలు రోడ్డులో గులకలేచి అధ్వానంగా ఉన్న ప్యాచ్‌వర్క్

రాజీవ్ గృహకల్పలో సమస్యల పరిష్కారానికి కృషి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గృహకల్ప నివాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక మారీసుపేటలోని రాజీవ్ గృహకల్ప నివాసాలను ఓఎస్డీ ఏసురత్నంతో కలసి మున్సిపల్ కమిషనర్ శేషన్న సందర్శించారు. ఈ సందర్భంగా నివాసితులు సెప్టిక్ ట్యాంక్‌లో వ్యర్థాలు నిండి పొంగుతోందని దానితో సమస్యగా ఉందని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కమిషనర్ పారిశుధ్య కార్మికులను పిలిపించి సెప్టిక్ ట్యాంక్ మూతను తొలగించి దానిలో వ్యర్థాలను తోడించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న, ఓఎస్డీ ఏసురత్నం తదితరులు

35వ వార్డులో తాగునీటి సరఫరా పరిశీలన

స్థానిక గంగానమ్మపేటలోని 35వ వార్డులో తాగునీటి సరఫరాను మున్సిపల్ కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల ఆ వార్డు ప్రజలు తాగునీరు రావడంలేదని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించి ఆ ప్రాంతంలో పర్యటించారు. పైపులైన్లను పరిశీలించిన కమిషనర్ గ్రౌండ్ లెవల్ ఉన్న పైపులైన్లకు స్వల్పంగా రావడాన్ని గుర్తించారు. మిగిలిన పైపులైన్‌లలో నీరు రాకపోవడంతో ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఏఈ బాషా, వాల్ ఆపరేటర్ సతీష్, ఇమ్యూనిటీ సెక్రటరీ మణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు రాకుండా నీటి పన్ను లెలా?

తమ వార్డులో కుళాయి కనెక్షన్‌లు ఉన్నప్పటికి వాటి ద్వారా తాగునీరు రావడంలేదని, కాని నీటి పన్ను మాత్రం తమకు వస్తుందని మున్సిపల్ కమిషనర్ శేషన్న ఎదుట వార్డు ప్రజలు వాపోయారు. గురువారం స్థానిక 35వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటిస్తుండగా ఆ వార్డు ప్రజలు ఆయనను కలసి నీటి పన్నుల కట్టాలంటూ సిబ్బంది వేధింపులపై ఆయన దృష్టికి తెచ్చారు. తాము ఉండే నివాస గృహాలకు తాగునీటి కనెక్షన్లు లేకపోయినా, తమకు మాత్రం నీటి పన్నులు కట్టాలంటూ డిమాండ్ నోటీసులు అందించారని తెలిపారు. మరికొందరు తమకు కుళాయి కనెక్షన్‌లు ఉన్నప్పటికి వాటి నుంచి చుక్క నీరు కూడా సరఫరా కావడంలేదని, అయినా నీటి పన్ను చెల్లించాలంటూ నోటీసులు అందాయన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ వార్డు ప్రజలు తెలిపిన సమస్య నీటి సరఫరా అంతరాయంపై సంబంధిత అధికారులతో సమీక్షలు జరిపి, తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు, పన్నుల మినహాయింపు విషయాలపై తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం

● సబ్ కలెక్టర్ సంజనాసిన్హా

తెనాలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభలతో భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొలకలూరులో సబ్‌కలెక్టర్ సంజనా సిన్హ, స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ గోపాలకృష్ణల ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. పలు భూ సమస్యలతో గ్రామంలోని దాదాపుగా 37మంది రైతులు సభకు వచ్చి వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరుతూ అర్జీలను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ కొలకలూరులో 37మంది రైతులు వివిధ సమస్యలతో 37అర్జీలు అందించారన్నారు. వాటిని ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. నిర్దేశిత సమయంలోపు వాటిని పరిష్కరించి రైతులకు మేలు జరిగేలా చూస్తానని తహసీల్దార్ స్పష్టం చేశారు. పలువురు రెవెన్యూ గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా, స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ గోపాలకృష్ణ

వెల్లలూరులో 100 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్లలూరు గ్రామ రెవెన్యూ సభకు 100 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెల్లలూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో మ్యుటేషన్ కోసం 5 అర్జీలు, పాస్ పుస్తకం ప్లేస్‌మెంట్ కోసం 1, అడంగల్ సవరణ కోసం 3, కుల ధృవీకరణ కోసం 45, ఆదాయ ధృవీకరణ కోసం 36, డిజిటల్ సిగ్నేచర్ కోసం 1, ఆధార్ సీడింగ్ కోసం 1, నకలు పట్టా కోసం 1, ఫ్యామిలీ మెంబర్ కోసం 2 దరఖాస్తులు అందాయి. సదస్సులో పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై దరఖాస్తులివ్వండి

కొల్లిపర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూమికి సంబంధించిన సమస్యలను రైతులు దరఖాస్తు రూపంలో తెలియజేయాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. గురువారం మండల పరిధిలోని దంతలూరులో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలపై 9 దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారణచేసి త్వరలో పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మంచి జరిగేలా చూస్తా

● తహసీల్దార్ గోపాలకృష్ణ



డొంక రోడ్డు సమస్యను రైతులతో కలిసి పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా కొలకలూరు గ్రామ రైతులు ఎదుర్కొంటున్న రైల్వేట్రాక్ పక్కన ఉన్న అడ్డీమూల డొంక సమస్యను పరిష్కరించి అన్నదాతలకు మేలు జరిగేలా చూస్తానని మండల తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. గురువారం మండలంలోని కొలకలూరులో ఎన్నో ఏళ్లుగా డొంకమార్గం ఆక్రమణలకు గురై రైతులు పడుతున్న ఇబ్బందులను తహసీల్దార్ గోపాలకృష్ణకు విన్నవించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ ఆ డొంక మార్గాన్ని పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగితెలుసుకున్నారు. అక్కడ ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమమించి అందులో పంటలు సాగుచేస్తున్నారని దీంతో డొంక మార్గాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని తహసీల్దార్‌కు వివరించారు. స్పందించిన తహసీల్దార్ ఆక్రమణదారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కాల్వకట్టపై ఆక్రమణల పరిశీలన

రైతులు పంటపొలాలకు వెళ్లి వచ్చేందుకు వీలుగా ఉన్న కొలకలూరు కొమ్ముమూరు కాలువ కట్ట రోడ్డును గ్రామానికి చెందిన తలశిల సాంబయ్య ఆక్రమించుకుని రాకపోకలు జరపకుండా కంచె అడ్డువేశాడని సబ్ కలెక్టర్ సంజనాసిన్హాకు తలశిల సత్యనారాయణ, తలశిల అప్పారావులు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణతో కలిసి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హ ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని రైతులతో కలిసి పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి: హరిప్రసాద్

తెనాలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించే పట్టబద్రుల ఆత్మీయ సమావేశానికి తెనాలి, వేమూరు నియోజకవర్గాల కూటమి శ్రేణులు, పట్టబద్రులు పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి హరిప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్వీఆర్ కల్యాణ మండపంలో పట్టబద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం: మార్కెట్ యార్డు మాజీ చైర్మన్

తెనాలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలిచిందని, దానిని చూసి జీర్ణించుకోలేక వైసీపీ ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నం చేస్తోందని జనసేన నాయకులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తొలి నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి గోతాల నుంచి రవాణా చార్జీల వరకూ చెల్లిస్తూ ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు తీసుకుని, ఆ డబ్బులు కూడా నేరుగా రైతుల ఖాతాలో సకాలంలో అందిస్తోందన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 156 రైతు సేవాకేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేసేందుకు 45క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెనాలి నియోజకవర్గంలో తెనాలిలో 18రైతు సేవాకేంద్రాలను 6 క్లస్టర్ పాయింట్లుగా, కొల్లిపరలోని 14 రైతు సేవాకేంద్రాలకు గానూ 5 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 21 రైతు సేవా కేంద్రాల పరిధిలో 327 మంది రైతుల నుంచి 2,120.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇందుకు 306 మంది రైతులకు రూ.4.39 కోట్లు నేరుగా జమచేశారన్నారు.

సాహిత్య రంగానికి రావినూతల సేవలు ఎనలేనివి: వీరవల్లి

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగానికి రావినూతల శ్రీరామమూర్తి చేసిన సేవలు ఎనలేనివని గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి చెప్పారు. రూరల్ మండలం అంగలకుదురు కల్యాణ మండపంలో గురువారం శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. రావినూతల ఫౌండేషన్ రూపొందించిన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఆయన చివరగా రచించిన సప్తగాన లహరి రచనను పుస్తక రూపంలో ముద్రించి ఆవిష్కరించారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా, గరికపాటి సుబ్బారావు, బొల్లిముంత కృష్ణ, బెల్లంకొండ వెంకట్, అయినాల మల్లేశ్వరరావు, కనగాల భూషణం, వేమూరి విజయబాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించాలి: ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కేటాయించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి నిధుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పలు అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు యథావిధిగా చెల్లించవచ్చు: డీఈఈ రాజశేఖర్

కొల్లిపర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు బిల్లులను ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద యథావిధిగా చెల్లించవచ్చునని విద్యుత్ డీఈఈ రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ బిల్లులు కట్టించుకునే సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకువచ్చారని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్‌కలెక్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శుక్రవారం నుంచి విద్యుత్‌బిల్లులు చెల్లించవచ్చునన్నారు. అదే విధంగా కొల్లిపర మండలంలో గురువారం రాత్రి విద్యుత్ తనిఖీలు నిర్వహించగా 50కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద సుమారు రూ 2లక్షలు అపరాదరుసుం విధించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఈ ప్రదీప్‌కుమార్, సబ్‌ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వద్ద ఎమ్మెల్యే నరేంద్ర జన్మదిన వేడుకలు

పెదకాకాని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీఎన్ఎస్ఎఫ్, టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ముందస్తు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 57 కేజీల భారీ కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో వికాస కార్యదర్శి జే శ్రీనివాస్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ కుమార్, అన్ని సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేస్ట్ పిక్కర్లకు రిక్షాబండ్లు వితరణ

తెనాలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీలో నివసిస్తున్న వేస్ట్ పిక్కర్లకు రిక్షా బండ్లను వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యాయవాది బసవయ్య పాల్గొని రిక్షాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధి లక్ష్యంగా యువత ఎదగాలి

● పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధి లక్ష్యంగా యువత ఎదగాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చెప్పారు. కొత్తపేటలో గురువారం డాక్టర్ గోగినేని హరిప్రసాద్ స్మారక స్కాలర్‌షిప్‌ను పంపిణీ చేశారు. ముంబై ఐఐటీలో చదువుతున్న హర్షిత అనే విద్యార్థినికి రూ.లక్ష సాయం అందించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ, డాక్టర్ గోగినేని ఉమ తమ కుటుంబ సభ్యుల పేరిట ప్రతి ఏటా విద్యార్థులకు సాయం అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్, సందీప్, ఈదర పూర్ణచంద్, రాజశేఖరరెడ్డి, కన్నెగంటి మురళి, బుల్లిప్రసాద్, కస్తూరిబాయి, గుమ్మడి సాంబశివరావు, కొడాలి శ్రీను, వెంకట్రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్ష ఉపకార వేతనం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే ఉమ

ప్రతి ఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల

చేబ్రోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కత్తెర సురేష్, కె.రవిశేఖర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా తదితరులు

16, 17 తేదీల్లో ఫోరెన్సిక్ అధికారుల రాక: జేసీ

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంపై ఈ నెల 16, 17 తేదీలలో హైదరాబాద్ నుంచి ఫోరెన్సిక్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తారని జేసీ సంజనాసిన్హా పసుపు రైతుల సంఘం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డికి తెలిపారు. సబ్ కలెక్టర్ రైతు సంఘం నాయకులతో గురువారం ఈ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం అందించేందుకు రైతుల బాండ్‌లు, బ్యాంకు ఖాతాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకుల వివరాలు, రైతులు తనిఖీ అధికారులకు సమర్పించాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఒరిజినల్ బాండ్లను రైతులు తేవాలని రైతుసంఘ నాయకులకు వివరించారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

● విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్వరరావు

తెనాలి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. తెనాలి కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయంలో విద్యాబోధన, క్రీడలకు తప్పనిసరి ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఉంటుందన్నారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ షబానా, పారా వాలీబాల్ క్రీడాకారుడు నాగరాజులను సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, రవికుమార్, రామిరెడ్డి, అజయ్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అంబియంట్ స్కూల్ విద్యార్థులు దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక చెంచుపేటలోని యేల్చూరి అమ్మ వృద్ధాశ్రమంలో గురువారం అంబియంట్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ షేక్ ఇర్షాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ రోజు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ షేక్ సల్మా, ప్రిన్సిపాల్ వై లక్ష్మీప్రసన్న, విద్యార్థినులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఇర్షాద్, సల్మా తదితరులు